
ఈనాడు
చిత్తూరు

గురువారం 31 ఆగస్టు 2017 | 16 పేజీలు

శ్రీవారి సేవలో గవర్నర్



16లో

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల గవర్నర్ నరసింహన్ బుధవారం తిరుమల శ్రీవారిని సతీ సమేతంగా దర్శించుకున్నారు. తితిదే ఈవో ఏకే సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు గవర్నర్ వెంటున్నారు.



- రాష్ట్రపతి పర్యటనకు భారీ ఏర్పాట్లు
- ప్రభుత్వం తరఫున పౌర సన్మానం, విందు
- ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

గోవిందుడి చెంతకు.. కోవిందుడు



ఈనాడు-తిరుపతి : దేశ ప్రథమ పౌరుడు రామ్‌నాథ్ కోవింద్ రాష్ట్ర పర్యటన ఖరారైంది. శుక్రవారం తిరుపతిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం ఆయన నేరుగా తిరుమలకు చేరుకుని శనివారం ఉదయం స్వామిని దర్శించుకోనున్నారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత రామ్‌నాథ్ కోవింద్ తొలిసారిగా రాష్ట్ర పర్యటనకు వస్తున్న నేపథ్యంలో ఆయనకు ఘన స్వాగతం పలకాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. ఇందుకనుగుణంగా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. సెప్టెంబర్ 1న సాయంత్రం ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ... మిగతా 7లో

కారణమేమిటంటే.?



- రోడ్డు ప్రమాదాలపై శాస్త్రీయ సర్వే
- రహదారులపై ఆర్టీసీ పరిశీలన
- 400 చోట్ల ప్రత్యేక చర్యలకు ప్రతిపాదనలు

మదనపల్లి - కడప రహదారిలో పుల్లగూరవారిపల్లె బస్‌స్టాప్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అక్కడ సూచిక బోర్డులు, వేగ నిరోధకాలు (స్పీడ్ బ్రేకర్లు) నిర్మించకపోవడం ఇందుకు కారణం. వీటిని వెంటనే ఏర్పాటు చేయాలి.

మదనపల్లి-పీలేరు మార్గంలోని ఎనుములవారిపల్లె వద్ద భారీ వృక్షాలు అడ్డంగా ఉండటం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు సమీపించే వరకూ కన్పించడం లేదు. అలా పరస్పరం ఢీకొంటున్నాయి. ఇక్కడ జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలి.

ఈనాడు-తిరుపతి: ఇలా జిల్లావ్యాప్తంగా వందల కిలోమీటర్ల కొద్దీ రహదారులపై ఉన్న ప్రమాదకర కేంద్రాలను గుర్తించి, నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధమైంది. పోలీసు, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల విభాగం అధికారులు సంయుక్తంగా ఈ బృహత్ కార్యాచరణలో భాగస్వాములవుతున్నారు. ప్రమాదకర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, కారణాలను ... మిగతా 7లో

కూలి రాక.. ఆకలి కేక



ఉపాధి హామీ కూలీలకు వేతనాలు చెల్లించడంలో ఒకప్పుడు జిల్లా అగ్రభాగాన ఉండేది. మూడుసార్లు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మాత్రం పరిస్థితి తిరగబడింది. పనిచేసి నెలలు గడిచినా కూలీలకు డబ్బులు అందలేదు. డబ్బులు అందక, పూట గడవక విలవిల్లాడుతున్నారు. ఎప్పుడిస్తారో అని నిరీక్షిస్తున్నారు. ఉపాధి పనులంటేనే విముఖత చూపుతున్నారు. ఫలితంగా పనులకు వస్తున్న వారి సంఖ్య పడిపోతోంది. ఈ పథకంతో ముడిపడిన ఇతర అభివృద్ధి పనులపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది.

- న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా పంచాయతీ)

- రెండు నెలలుగా ఆగిన కూలి డబ్బులు
- జిల్లాలో రూ.50 కోట్ల బకాయిలు
- గృహ నిర్మాణంపైనా ప్రభావం
- నత్తనడకన పనుల ప్రగతి

65 రోజులు.. రూ.50 కోట్లు.. ఇదేదో ఆదాయం కాదు. జిల్లాలో స్వేదం చిందించి ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు అందాల్సిన కూలీ డబ్బులు. రెక్కాడితేగానీ డొక్కాడని పేదలు నిత్యం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. కనిపించిన సిబ్బందిని మా పైసలెప్పుడిస్తారయ్యా అంటూ ఆవేదనతో అడుగుతున్నారు. అదిగో ఇదిగో అంటూ రెండు నెలలు గడిచిపోయింది. ఇంకా పైసలు చేతికందలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రావాల్సిన ఉపాధి హామీ నిధుల విడుదలలో జాప్యంతో బకాయిలు రోజురోజుకూ పేరుకుపోతున్నాయి. రెండు నెలలుగా చెల్లింపులు ఆగిపోయాయి.

అనుసంధాన పనులపైనా ప్రభావం.. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో చేపట్టే ఇతర అభివృద్ధి పనులపైనా నిధుల కొరత ప్రభావం చూపుతోంది. సిమెంటు రహదారులు, వ్యక్తిగత మరుగుదొడ్లు, అంగన్‌వాడీ భవనాలు, పంచాయతీ భవనాలు, శ్మశాన వాటికల అభివృద్ధి, ఆట స్థలాలు వంటి పనులకు కాంపొనెంట్ రూపంలో చెల్లించాల్సిన బిల్లుల చెల్లింపూ ఆగిపోయింది. జిల్లాలో 800 కిలోమీటర్లు సీసీ రోడ్లు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటివరకూ 100 కి.మీ మాత్రమే వేశారు. 664 అంగన్‌వాడీ భవనాలూ అసంపూర్తిగా ఉన్నాయి. శ్మశానవాటికల నిర్మాణ ... మిగతా 7లో

మత్స్య రంగానికి ఉజ్వల భవిత

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: ఆక్వా రంగానికి రాష్ట్రంలో అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని విక్రమ సింహపురి వర్సిటీ మాజీ వీసీ ఆచార్య రాజారామిరెడ్డి పేర్కొన్నారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగాధ్వర్యంలో 'మత్స్య ఉత్పత్తులు, జీవవైవిధ్య పరిరక్షణ, పర్యావరణ కాలుష్యం' అనే అంశంపై రెండురోజుల జాతీయ సదస్సు బుధవారం సెనెట్‌హాల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ సహిత పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రకృతి సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సామాజిక సవాళ్లకు తగినట్లు ఈ సదస్సును నిర్వహించడం హర్షదాయకమన్నారు. మత్స్య రంగం అభివృద్ధి కోసం దేశంలో పరిశోధనలను మరింతగా విస్తృతపరచాలని సూచించారు. ఎస్వీయూ మాజీ వీసీ ఆచార్య రాజేంద్ర మాట్లాడుతూ దేశంలో పర్యావరణ పరిరక్షణపై నిర్లక్ష్యం ఉందని, భవిష్యత్తుతరాలకు ప్రకృతిని అందించే అవకాశాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్వీయూ రెక్టార్ ఆచార్య భాస్కర్ మాట్లాడుతూ భారతదేశంలో మత్స్య సంపద అధికంగా ఉందని, ఈ రంగంలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ దేవరాజులు, ప్రిన్సిపల్ అబ్బయ్య, విభాగాధిపతి ఉషారాణి, సదస్సు కన్వీనర్ పి.శ్రీనివాసుల రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులు ఎం.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్ సునీత, కె.ఎల్లమ్మ, సత్యవేలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో జ్యోతిప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు

15లోగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు

వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్

చిత్తూరు(వ్యవసాయం), న్యూస్‌టుడే : సాగుకు నోచుకోని భూముల్లో ఈ నెల 15వ తేదీ లోగా ప్రత్యామ్నాయ పంటల సాగుకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన వ్యవసాయ శాఖ ఏడీ, ఏవోలతో చరవాణి సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ సాధారణ సాగులో సుమారు 51 వేల హెక్టార్లు సాగుకు నోచుకోలేదని, ఆ భూముల్లో ప్రత్యామ్నాయ పంటల సాగు విస్తరణకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యామ్నాయ పంటల విస్తరణకు ఉచితంగా ఉలవలు, అలసంద, అనప తదితర విత్తనాలను పంపిణీ చేస్తున్నామన్నారు. విత్తన కొరత లేదని అవసరమైనంతగా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. విత్తనాలు కావలసిన అధికారులు సత్వరమే ప్రతిపాదనలు పంపితే సరఫరా చేస్తామన్నారు. మామిడి తోటల్లో కూడా ఉలవ సాగుకు జిల్లా పాలనాధికారి ప్రద్యుమ్న ఆదేశాలు జారీ చేశారని, ఆ దిశగా పంట విస్తరణకు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఉలవలతో పాటు అలసంద, ఉద్దులు, పెసలు సాగు విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఖరీఫ్ సాధారణ సాగులో లోటు ఉండరాదని, ఖాళీ భూముల్లో సైతం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలన్నారు. అలాగే అర్హులైన రైతులందరికి పంట రుణాలు అందేలా చూడాలన్నారు. 1వ తేదీ నుంచి ఈ-పాస్(వేలిముద్ర ఆధారిత) ఆధారంగా ఎరువుల పంపిణీ ప్రారంభం కానున్నదని, ఈ విధానంపై రైతులకు తెలియజేయాలని తెలిపారు. అనంతరం వివిధ పథకాల లక్ష్యాలు, ప్రగతిపై మండలాల వారీగా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ మనోహర్, సాంకేతిక అధికారులు ప్రవీణ్‌కుమార్, ప్రపూర్ణ, భారతి, సంగీత, సుజాత పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త జె.సురేష్

గొర్రెలు, మేకల పెంపకం లాభదాయకం

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: రైతులు గొర్రెలు, మేకల పెంపకాన్ని వ్యాపార సరళిలో నిర్వహించడం ద్వారా లాభాలను ఆర్జించవచ్చని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ విశ్వవిద్యాలయ నిరంతర శిక్షణ కేంద్రం సమన్వయకర్త డాక్టర్ బి.శోభామణి అన్నారు. పశువైద్య విశ్వవిద్యాలయ రైతు శిక్షణ కేంద్రంలో బుధవారం గొర్రెలు, మేకల పెంపకం అనే అంశంపై ఔత్సాహిక రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో ప్రారంభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పశువైద్య విశ్వవిద్యాలయం రైతులకు, పశువైద్యులకు ఆధునిక వైద్య విధానాలు, పశుపోషణలో మెలకువలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి గల రైతుల పేర్లను నమోదు చేసుకుంటే వారి అవసరాలకు అనువైన అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు. పాడి రంగంలో రైతులకు వచ్చే సమస్యలను పరిష్కరించే లక్ష్యంతో శిక్షణ ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ముందస్తుగా పేర్లు నమోదు చేసుకున్న చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాలకు చెందిన రైతులకు పశువైద్య కళాశాల అచార్యులు జె.సురేష్, దేవసేన, వీరబ్రహ్మయ్య, ఆర్.వేణు, రంగమ్మ, శ్రీనివాసరావు తదితరులు జీవాల యాజమాన్య పద్ధతులు, పశుగ్రాసాలు, పోషణ, దాణా తయారు చేయు విధానం, గర్భకోశవ్యాధులు, పరాన్నజీవులు, సూక్ష్మజీవుల వలన కలిగే వ్యాధులు నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులు పశుగ్రాస క్షేత్రాలు, పశు పోషణ కేంద్రాన్ని ప్రత్యక్ష పరిశీలన చేశారు.

జీతాలపై జీఎస్టీ ప్రభావం

నిధుల్లేక ఇతర బిల్లులు సర్దుబాటు | సంక్షేమ నిధులపై ఆంక్షలు

చిత్తూరు(జిల్లా సచివాలయం), న్యూస్‌టుడే : వస్తు సేవల పన్ను (జీఎస్టీ) ప్రతికూల ప్రభావం జిల్లాపై అప్పుడే కనిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం తగ్గటం, లోటు పూడ్చటానికి కేంద్రం నుంచి నిధులు రాకపోవడంతో ఉద్యోగులకు ప్రతినెలా 1న చెల్లించే జీతాలకూ నిధులు వెతుక్కోవాల్సిన దుస్థితి నెలకొంది. సరిపడా నిధులు లేకపోవడంతో సంక్షేమ పథకాలు, లబ్ధిదారులకు చెల్లించాల్సిన నిధులను వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది.

ఆర్థిక సర్దుబాటులో భాగంగా ప్రభుత్వం ఖజానా ద్వారా చెల్లించాల్సిన బిల్లులపై ఆంక్షలు విధించింది. సెప్టెంబరు 1వ తేదీ నాటికి ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాల్సిఉంది. మరోవైపు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి ఆశించిన మేర లేదు. దీంతో ఆర్థిక సర్దుబాటులో భాగంగా ఉద్యోగులకు వేతనాలు చెల్లించడానికి ప్రాధాన్యత ఇస్తూ.. మిగిలిన బిల్లులను నిలుపుదల చేసింది. ఇప్పటికే వివిధ శాఖల ద్వారా చెల్లించాల్సిన బిల్లులపై అనధికార ఆంక్షలు అమలవుతున్నాయి. జీఎస్టీ అమలుతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం తగ్గింది. మరోవైపు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాలేదు. నిధుల విడుదల తేదీని కేంద్ర ప్రభుత్వం 1వ తేదీ నుంచి 15వ తేదీకి మార్చింది. ఈ నేపథ్యంలో ఉన్న నిధులతో ఉద్యోగుల వేతనాలను చెల్లించడానికి వెచ్చిస్తోంది. జిల్లాలో ఉద్యోగుల వేతనాలు, పింఛన్ల కోసం సుమారు రూ.200 కోట్లు అవసరముంది. ఇప్పటికే ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన బిల్లులను ఆమోదించి బ్యాంకులకు చేర్చారు. మిగిలిన బిల్లులు ఖజానా శాఖ వద్ద ఉన్నాయి. ప్రధానంగా వివిధ శాఖల ద్వారా లబ్ధిదారులకు చెల్లించాల్సిన బిల్లులు, ఉద్యోగుల బకాయిలు, గ్రామపంచాయతీ చెక్కులు, ఎన్‌వోసీలు, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని బిల్లులు వంటి వాటిపై ఆంక్షలు విధించారు. వివిధ శాఖలు, ఇతరత్రా చెల్లింపులకు సంబంధించి జిల్లా ఖజానా శాఖలో సుమారు రూ.80 కోట్ల విలువైన 4వేల వరకు బిల్లులు ఆమోదం కోసం ఉన్నాయి. జీతాల చెల్లింపులకు నగదు సర్దుబాటు పూర్తిచేసిన అనంతరం ప్రాధాన్యతల బట్టి మిగిలిన చెల్లింపులకు ప్రభుత్వం ఆమోదముద్ర వేయనుంది.



స్కిట్ ఇంజినీరింగ్ కళాశాల ముఖద్వారం

చర్చలు ఫలించేనా..!

నేడు 'స్కిట్' భవితవ్యంపై సమీక్ష

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా.. దేవాదాయ శాఖ పరిధిలో నడుస్తున్న ఏకైక ఇంజినీరింగ్ కళాశాలగా శ్రీకాళహస్తీశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్) గుర్తింపును సంతరించుకుంది. గతమెంతో ప్రాభవాన్ని చాటుకున్నా.. ప్రస్తుతం పరిస్థితి దయనీయంగా మారింది. ఈ విద్యా సంవత్సరంలో.. ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి 360 సీట్లకు గాను చేరింది కేవలం 18 మంది మాత్రమే. దీన్ని బట్టి కళాశాల పరిస్థితి ఎంతటి దయనీయంగా ఉందన్నది అర్థమవుతుంది. ఈ పరిస్థితుల్లో కళాశాలకు తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకురావాలంటే ఏం చేయాలి.. జేఎన్‌టీయూకు విలీనం చేస్తే ఎలా ఉంటుంది అన్న అంశాలకు సంబంధించి నిర్ణయం తీసుకునేందుకు దేవాదాయ శాఖ సంసిద్ధమైంది. ఈ విషయమై గురువారం అమరావతిలోని సచివాలయంలో.. దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి మన్మోహన్‌సింగ్, కమిషనర్ అనురాధ నేతృత్వంలో.. రాష్ట్ర సాంకేతిక విద్య కమిషనర్, అనంతపురం జేఎన్‌టీయూ ఉపకులపతి, ముక్కంటి ఆలయ ఈవో, కళాశాల ప్రిన్సిపల్ సమావేశం కానున్నారు. ఇక్కడి కళాశాల గతమెంతో వైభవంగా.. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు వెన్నంటూ ఉంటూ వచ్చిన ఇక్కడి ఇంజినీరింగ్ కళాశాల పరిస్థితి ఇలా తయారైంది. కళాశాల ఏర్పాటు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగినా.. కొందరు తమ ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోవడం, అడ్డగోలుగా పదోన్నతులు, అధ్యాపకుల మధ్య వర్గపోరు తదితర కారణాలతో విద్యాబోధనపై రాన్రాను శ్రద్ధ తగ్గింది. దీంతో పాటు.. ఉత్తీర్ణత శాతం తగ్గడం, ఇక్కడ విద్యనభ్యసించిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు రాకపోవడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్లో ఆశాజనకమైన నిర్ణయం వస్తుందని.. ప్రస్తుతం విద్యార్థులు, ఇక్కడున్న బోధన, బోధనేతర సిబ్బంది ఎంతో ఆశతో నిరీక్షిస్తున్నారు.


శుక్రవారం జరగనున్న రథోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

బొజ్జగణపయ్య.. బ్రహ్మాండ వేడుక

ప్రమదాయ.. ప్రథమాయ.. పాహిమాం!


ఉత్సవమూర్తులకు హారతులిస్తున్న దృశ్యం

పార్వతమ్మ చేతి
పసుపుముద్ద..
ప్రాణం పోసుకున్న ప్రజ్ఞాయ!
అంబికమ్మ ఇష్టపుత్ర..
పూజల్లో ప్రథమాయ..
శివ శివ మూర్తివి గణనాథా..
చూపుల్లో మహేశాయ..
షణ్ముఖ సోదరా...
భక్తజనులకు
సర్వైశ్వర్య ప్రదాయ...
ప్రమదాయ..
ప్రమోదాయ.. పాహిమాం
మహాబలాయ..
మహోదరాయ..
మహావీరాయ.. వందనం!
ప్రసన్న వదనాయ..
పరమ పావనాయ..
దయామయ నమో నమ!


వృషభ వాహనంపై విహరిస్తున్న వరసిద్ధి వినాయకుడు

న్యూస్‌టుడే, కాణిపాకం: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయం బ్రహ్మోత్సవాల శోభతో విరాజిల్లుతోంది. అయిదో రోజు బుధవారం రాత్రి స్వామివారికి వృషభ వాహనసేవ నిర్వహించారు. ఉదయం మూల విగ్రహానికి సంప్రదాయబద్ధంగా పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం స్వామివారి మూల విగ్రహాన్ని సర్వాలంకృతులు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించి, భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. వాహనసేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఈవో పెనుమాక పూర్ణచంద్రరావు, ఏసీ వెంకటేష్, ఏఈవోలు కేశవరావు, రవీంద్రబాబు, సూపరింటెండెంట్ స్వాములు, ఇన్‌స్పెక్టర్లు రమేష్, మల్లికార్జున పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో 'ఈనాడు'

కాణిపాకం, న్యూస్‌టుడే

పగలు: అభిషేకం **రాత్రి:** గజ వాహనం

ఉభయదాతలు: కాణిపాకం వన్నియనాయకర్ వంశస్థులు

ఆస్థాన మండపంలో... ● ఉదయం 10-12 గంటల వరకు ఆనందనాయుడు, ఎస్ఆర్ పురం వారితో ధార్మికోపన్యాసం ● ఉదయం 12-2 గంటల వరకు చంద్రశేఖర్ భాగవతార్, మంగళం వారితో హరికథ ● మధ్యాహ్నం 2-4 గంటల వరకు సాయితేజ, హారతి, సంతపేట వారితో భక్తి గీతాలు ● సాయంత్రం 4-6 గంటల వరకు జగదీష్ ప్రసాద్, శ్రీకాళహస్తి వారితో కూచిపూడి నృత్యం ● సాయంత్రం 6-8 గంటల వరకు క్రాంతి, హైదరాబాద్ వారితో భరతనాట్యం ● రాత్రి 8-11 గంటల వరకు అంజూరు హరిప్రసాద్, కేవీబీపురం వారితో పౌరాణిక నాటక ప్రదర్శన ● రాత్రి 11-2 గంట వరకు రమణారావు, పళ్లం వారితో పౌరాణిక నాటకం



నాట్య నైవేద్యం


శబ్దనీరాజనం: ఆలయ అన్వేటి మండపంలో నిర్వహించిన డోలు, నాదస్వర కచేరి

భక్తుల నీరాజనం

కాణిపాకం, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం భక్తులు వరసిద్ధునికి నీరాజనాలు పలికారు. రాత్రి జరిగిన వృషభ వాహన సేవకు ముందు స్వామివారు ఉభయదేవేరులతో కలసి కాణిపాకం పురవీధుల్లో ఊరేగారు. కార్యక్రమానికి కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అంతకు ముందు సిద్ధి బుద్ధి సమేతుడైన వరసిద్ధి వినాయకస్వామి వారిని సర్వాలంకృతులు చేసి, అలంకార మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. శుక్రవారం జరగనున్న రథోత్సవానికి సంబంధించిన పలు ఏర్పాట్లు ప్రారంభయ్యాయి. రథ కలశస్థాపన ఘనంగా జరిగింది.


బుధవారం ఉదయం కాణిపాకం పురవీధుల్లో భక్తులకు దర్శనమిస్తున్న సిద్ధిబుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి

నిత్యాన్నదాన పథకానికి రూ.5లక్షల విరాళం

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు విరాళం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన శేషమాంబ ఫౌండేషన్ ఎండీ సీఎస్ ప్రసాద్ రూ.5లక్షల చెక్కును ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు అందించారు. ఆలయ మర్యాదల ప్రకారం దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందించారు. మూషికమండపంలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు. ప్రాంగణంలోని వీరాంజనేయస్వామి, నవగ్రహాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.


నిత్యాన్నదాన పథకానికి చెక్కును ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు అందిస్తున్న దాత సీఎస్ ప్రసాద్ దంపతులు



కుబేర గణపతి

పలమనేరు పట్టణంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని రూ.2 వేల కొత్త నోట్లతో అలంకరించారు. స్థానిక పండ్ల వ్యాపారి మురళి బుధవారం సాయంత్రం స్వామివారిని రూ. 15 లక్షల నగదుతో అలంకరించి కుబేర గణపతిగా కొలిచారు.

\- న్యూస్‌టుడే, పలమనేరు

4 నుంచి కల్యాణ వేంకన్న పవిత్రోత్సవాలు

నారాయణవనం, న్యూస్‌టుడే: నారాయణవనంలో వెలసిన శ్రీపద్మావతిదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సెప్టెంబరు 4 నుంచి పవిత్రోత్సవాలు జరుగుతాయని ఆలయాధికారి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 4, 5 తేదీల్లో ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు.



భక్తులతో కలిసి ఆలయానికి వస్తున్న ఎమ్మెల్యే, తుడా ఛైర్మన్ తదితరులు

తిరుపతి

రైలుకిందపడి గుర్తుతెలియని వృద్ధుడి మృతి

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: రైలు కిందపడి సుమారు 60 సంవత్సరాల వయసున్న గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం సాయంత్రం 5.30 గంటలకు జరిగింది. తిరుపతి నుంచి రేణిగుంట వెళుతున్న గూడూరు ప్యాసింజర్ రైలు సీఆర్ఎస్ వద్ద క్రాసింగ్‌కోసం ఆగింది. అదే సమయంలో కిందకు దిగిన వృద్ధుడు రైలు కదలడంతో పడిపోయిరెండుకాళ్లు తెగిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. తిరుపతి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాతయ్యగుంట ఆలయంలో దివ్యదర్శనం భక్తులు

తిరుపతి(తాతయ్యగుంట), న్యూస్‌టుడే: తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన దివ్యదర్శనంలో పొందుపరచడం సంతోషంగా ఉందని తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మెన్ నరసింహయాదవ్ అన్నారు. స్థానిక తాతానగర్‌లోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి బుధవారం దివ్యదర్శనం భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎమ్మెల్యే, తుడా ఛైర్మెన్, ఆలయ పాలకమండలి సభ్యులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయం మరింత అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక దృష్టితో దివ్యదర్శనంలో పొందుపరిచినట్లు ఆలయ ఛైర్మన్ ఆర్‌సీ మునికృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం, పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో రూ.7 కోట్ల టోకరా

పోలీసుల అదుపులో నిందితుడు

తిరుచానూరు, న్యూస్‌టుడే: తిరుపతి గ్రామీణ మండలం పద్మావతిపురంలో ఓ వ్యక్తి చీటీల పేరుతో స్థానికులను మోసం చేసిన విషయం బుధవారం బాధితుల ఫిర్యాదుతో వెలుగు చూసింది. వివరాలు ఇలా... రామచంద్రాపురానికి చెందిన సంజయ్‌రెడ్డి కొంతకాలంగా పద్మావతిపురంలో నివాసం ఉంటూ చీరల వ్యాపారం చేస్తున్నాడు. స్థానికంగా ఉండే తన స్నేహితుడు గల్లా సతీష్‌బాబుతో కలిసి చీటీ వ్యాపారాన్ని ప్రారంభించాడు. సతీష్‌బాబును నమ్మి అనేక మంది వీరి వద్ద లక్షలాది రూపాయలు చీటీలు వేశారు. అయితే సంజయ్‌రెడ్డి చీటీ డబ్బులు వసూలు చేసుకుని వ్యక్తిగత పనులపై సొంతూరికి వెళ్లి వస్తానంటూ చెప్పి పారిపోయాడు. కొన్ని రోజులు ఎదురు చేసిన బాధితులు తమ చీటీ డబ్బులు చెల్లించాలని సతీష్‌బాబుపై ఒత్తిడి పెంచారు. బాధితుల నుంచి ఒత్తిడి పెరగడంతో అతను తిరుచానూరు పోలీసులకు లొంగిపోయాడు. ఇందులో కీలకపాత్ర పోషించిన సంజయ్‌రెడ్డి దాదాపు రూ.7 కోట్లకు పైగా చీటీ వసూలు చేసి చెల్లించకుండా డబ్బులతో పారిపోయినట్లు సమాచారం. పెద్ద సంఖ్యలో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు తిరుచానూరు సీఐ భాస్కర్ విచారణ ప్రారంభించారు.

కదలని మురుగు.. వెలగని దీపం

తిరుపతిలోని పలు డివిజన్లు సమస్యలతో తల్లడిల్లుతున్నాయి. అధికారులకు ఫిర్యాదులు అందినా వాటిని పరిష్కరించడంలో సిబ్బంది విఫలం అవుతున్నారు. నగరపాలికకు వివిధ రూపాల్లో ఫిర్యాదు చేసినా ఆశించిన స్పందన లేకపోవడంతో ప్రజలు 'ఈనాడు' వాట్సాప్‌ను ఆశ్రయిస్తున్నారు. అందిన ఫిర్యాదులను 'ఈనాడు' నగరపాలిక అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తోంది. అందిన ఫిర్యాదులు.. వాటి పరిష్కారం ఇలా..

– న్యూస్‌టుడే, తిరుపతి(నగరపాలిక)

☛ 'ఈనాడు' వాట్సాప్‌నకు సమస్యల వెల్లువ ☛ పరిష్కారానికి అధికారుల హామీ

వెలగని వీధిదీపాలు



సమస్య: కొర్లగుంట మారుతీనగర్‌లోని ప్రశాంత్ పాఠశాల ఎదురుగా ఇంటి నెంబరు 20-2-507 వద్ద వీధిదీపం చాలా కాలంగా వెలగడం లేదు. ఇదే వీధిలో గత వారం రోజులుగా ఐదు విద్యుత్ స్తంభాలకు ఉన్న దీపాలు వెలగడం లేదు. సమస్యను నగరపాలిక అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. వారు వచ్చి నామమాత్రంగా మరమ్మతులు చేశారు. వారు తిరిగి వెళ్లిన గంటకే అవి వెలగడం లేదు. అధికారులు చిత్తశుద్ధితో వాటిని మరమ్మతులు చేయిస్తే ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుంది.

– కొర్లగుంట మారుతీనగర్ వాసులు

సమాధానం: వీధిదీపాలకు మరమ్మతులు చేయించి.. సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. **– సుధాకరరావు, ఎస్.ఈ, నగరపాలిక సంస్థ**

మురుగుమయంగా కూరగాయల మార్కెట్



సమస్య: తిరుపతి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ మురుగుమయంగా మారింది. వర్షపు నీరు వెళ్లే మార్గం లేకపోవడంతో నీరు మార్కెట్‌లోనే నిల్వ ఉండిపోతున్నాయి. అడుగు పెట్టడానికి కూడా వీలు లేకుండా బురద నీరు ఉంది. ముఖ్యంగా పడమటి ద్వారం సమీపంలో మురుగునీరు కొలను తలపిస్తోంది. దుర్వాసనతో పాటు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా మారింది. **– పి.ప్రకాష్, స్థానికుడు**

సమాధానం: సంబంధిత ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించి మార్కెట్‌ను పరిశుభ్రంగా తయారు చేస్తాం. **– డాక్టర్ ఉషాకుమారి, నగరపాలిక వైద్యాధికారిణి**

ఖాళీ స్థలంలో చెట్లతో పాముల బెడద

సమస్య: కొర్లగుంట మారుతీనగర్‌లోని శ్రీవారి హైస్కూల్ సమీపంలో ఉన్న ప్రైవేటు వ్యక్తికి చెందిన ఖాళీ స్థలంలో చెట్లు ఏపుగా పెరిగిపోయాయి. ముళ్లపొదలను తలపించేలా ఉన్న ఖాళీస్థలంలో పాములు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ఇటీవల కాలంలో ఇవి ఇళ్లలోకి వస్తున్నాయి. స్థల యజమాని వివరాలు తెలియకపోవడంతో వారికి సమాచారం ఇవ్వలేకపోతున్నాం. రాత్రిపూట ఈ మార్గంలో రాకపోకలు సాగించడానికి ఎవరూ సాహసించడం లేదు. అధికారులు చొరవ తీసుకోవాలి.


– ఎన్.రాజశేఖర్, కొర్లగుంట మారుతీనగర్



సమాధానం: స్థల యజమాని వివరాలకు సంబంధించి దస్త్రాలు పరిశీలించి తాఖీదులు జారీ చేస్తాం. ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత స్థల యజమానులదే.

– గుణశేఖర్, పట్టణ ప్రణాళికాధికారి

దుస్థితిలో కాలువలు



సమస్య: డీఆర్ మహల్ రోడ్డులోని టీవీఎస్ షోరూం మార్గంలో మురుగునీటి కాలువలు శుభ్రం చేసి చాలా కాలమైంది. డీఆర్ మహల్ నుంచి టీవీఎస్‌షోరూం వరకూ కాలువలు దాదాపు కనుమరుగయ్యాయి. కాలువల్లో పెద్ద ఎత్తున చెత్త చేరి ప్రమాదకరంగా మారాయి. భరించలేని వాసనతో పాటు దోమలు సైతం ఎక్కువగా ఉన్నాయి. సమస్యను నగరపాలిక కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి నెల రోజులవుతున్నా పరిష్కారం లభించ లేదు.

– సందీప్, డీఆర్ మహల్‌రోడ్డు

సమాధానం: సమస్యను పరిష్కరించేలా సంబంధిత ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశిస్తాం.

– డాక్టర్ ఉషాకుమారి, నగరపాలిక వైద్యాధికారిణి

మీరూ స్పందించండి

మీ డివిజన్‌లో సమస్యలా? రహదారులు దెబ్బతిన్నాయా? కాలువల్లో మురుగు నిండిందా? రహదారుల వెంట చెత్త దర్శనమిస్తోందా?.. ఇలాంటి సమస్యలను వెలుగులోకి తీసుకురావడానికి 'ఈనాడు' మీకో అవకాశం కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా డివిజన్‌లో సమస్యపై ఫొటో తీసి, పేరు, చిరునామాతో ఈ కింద ఇచ్చిన వాట్సాప్ నంబరుకు పంపించండి. సమస్యలను స్వయంగా పరిశీలించి ప్రచురిస్తాం..

వాట్సాప్ నంబరు: 8008020003

వ్యవసాయ విద్యార్థులకు భాజపా మద్దతు

తిరుపతి(పశువైద్య విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో వ్యవసాయ విద్యార్థుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు జల్లి మధుసూదన్ తెలిపారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు 26 రోజులుగా చేస్తున్న నిరసన దీక్షకు ఆయన బుధవారం మద్దతు ప్రకటించారు. తిరుపతి-చంద్రగిరి మార్గంలో వ్యవసాయ కళాశాల ప్రవేశద్వారం ఎదుట విద్యార్థులు చేపట్టిన నిరసన దీక్ష 26 రోజుకు చేరింది. విద్యార్థులు తలపై టోపీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు తెలిపారు. దీక్షా శిబిరం వద్దకు భాజపా నాయకులు వెళ్లి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ విద్యను నీరుగార్చేందుకు వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు జారీ చేసిన జీవో నెంబరు 64తో కలిగే అనర్థాలను విద్యార్థులు వివరించారు. దీంతో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగం పొందిన వ్యవసాయశాఖ అధికారులను తొలగించి, జీవో నెంబరు 64 రద్దు చేసేందుకు మద్దతు ఇవ్వాలని విద్యార్థులు మధుసూదన్‌ను కోరారు.



వ్యవసాయ కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మరో 1704 ఇళ్లు సిద్ధం

లబ్ధిదారులకు నగరపాలిక అధికారుల అవగాహన

తిరుపతి(నగరపాలిక), న్యూస్‌టుడే: తిరుపతి సమీపంలోని తనపల్లెలో 1704 ఇళ్లు ప్రారంభానికి సిద్ధమయ్యాయి. ఐహెచ్ఎస్‌డీపీ పథకం కింద నిర్మించిన 1704 మంది ఇళ్ల లబ్ధిదారులతో బుధవారం నగరపాలక కమిషనర్ శ్రీదేవి సమావేశం నిర్వహించారు. తనపల్లె వద్ద మరో 25 రోజుల్లో ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె వివరించారు. వారి ఇళ్ల మంజూరు పత్రాలు, రేషన్‌కార్డులు, ఆధార్‌కార్డులు ఇతర ధ్రువీకరణ పత్రాలను సిబ్బంది పరిశీలించారు. లబ్ధిదారులు వాటా చెల్లించాల్సిన మొత్తాన్ని నగరపాలిక ఆవరణలోని లలిత కళా ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న ప్రత్యేక కౌంటర్‌లో త్వరగా చెల్లించాలని కమిషనర్ కోరారు. త్వరలో లాటరీ విధానంలో లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించనున్నట్లు స్పష్టం చేశారు. 2011లో జెఎన్‌ఎన్‌యూఆర్‌ఎం పథకంలో భాగంగా బహుళ అంతస్తుల విధానంలో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి మధ్యలోనే ఆపేశారు. ఈ అసంపూర్తి గృహ నిర్మాణాల పనులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పునః ప్రారంభించి 71 విభాగాల్లో ఒక్కో విభాగంలో 24 ఇళ్ల చొప్పున బహుళ అంతస్తుల విధానంలో నిర్మించినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే మంజూరు పత్రాలు పొందిన వారికి దామినేడు, వికృతమాల, పాడిపేట వద్ద నిర్మాణంలో ఉన్న ఇళ్లను కేటాయించనున్నట్లు కమిషనర్ తెలిపారు.



లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న నగరపాలిక సిబ్బంది

సేవలతో గుర్తింపు

మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), న్యూస్‌టుడే: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం గణిత విభాగం ఆచార్యులు లీలారత్నం విభాగం అభివృద్ధికి చేసిన సేవలు అభినందనీయమని వర్సిటీ ఉపకులపతి ఆచార్య వి.దుర్గాభవాని పేర్కొన్నారు. ఆచార్య లీలారత్నం గురువారంతో పదవీ విరమణ చేయనున్నారు. ఈ సందర్భంగా బోధనా సిబ్బంది సంఘం ఆధ్వర్యంలో వర్సిటీ సావేరి సమావేశ మందిరంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆచార్యులుగా, విద్యార్థి వ్యవహారాల డీన్, విభాగాధిపతిగా వర్సిటీకి, విభాగాభివృద్ధికి ఆమె ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆమె హయాంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహించారని తెలిపారు. అనంతరం ఆచార్య లీలారత్నంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య మమత, బోధనా సిబ్బంది సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, ఇతర సభ్యులు, డీన్లు, పలువురు ఆచార్యులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఆచార్య లీలారత్నంను సన్మానిస్తున్న వీసీ ఆచార్య దుర్గాభవాని తదితరులు

తిరుపతి


ఆర్థిక సాయం అందజేస్తున్న అభిమానులు

పేద విద్యార్థులకు బాలకృష్ణ అభిమానుల ఆర్థిక సాయం

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: బాలకృష్ణ నటించిన 'పైసా వసూల్' చిత్రం సెప్టెంబర్ 1వ తేదీన విడుదలౌతున్న సందర్భంగా ఇద్దరు పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.20వేలు ఆర్థిక సాయాన్ని బాలయ్య అభిమానులు మనోహర్‌రెడ్డి, కేపీ చౌదరి ఆధ్వర్యంలో బజారు వీధిలోని జైన్ జువెలర్స్ అధినేత ప్రకాష్ చంద్ గోకర్ణ బుధవారం అందజేశారు. ఆర్థియ సాయం పొందిన వారిలో ఎన్‌టీఆర్ వీరాభిమాని చెంగయ్య మనుమరాలు శ్రీలక్ష్మి, సుధాకర్ కుమారుడు మధు ఉన్నారు. కార్యక్రమంలో బాలయ్య అభిమానులు రవితేజ, లోకేష్, షఫి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


ఆచార్య గార్లపాటిని సత్కరిస్తున్న శిష్యబృందం

గార్లపాటికి ఘనసత్కారం

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: మాతృభాషకు మూడు దశాబ్దాలుగా విశేష సేవలందించిన ఎస్వీయూ విశ్రాంతాచార్యులు, తితిదే ధర్మప్రచార పరిషత్ పరీక్షల విభాగం ప్రత్యేకాధికారి గార్లపాటి దామోదర నాయుడుకు ఏపీ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ గిడుగు జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా తెలుగు భాషా సేవా పురస్కారాన్ని అందజేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తిరుపతిలో గార్లపాటి మార్గదర్శకత్వంలో పరిశోధనలు చేసిన శిష్యబృందం ఆయన్ను బుధవారం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా దామోదర నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి సత్కారం పొందడం తనకెంతో సంతోషాన్నిచ్చిందని పేర్కొన్నారు. తెలుగు భాషాభివృద్ధికి ప్రతిఒక్కరు కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శిష్యులు డాక్టర్ కడియాల వెంకటరమణ, డాక్టర్ నల్లన్న, డాక్టర్ రవిచంద్ర, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ సుహాసిని, డాక్టర్ సుభద్ర, డాక్టర్ మస్తానమ్మ, డాక్టర్ పరమేశ్వరయ్య తదితరులున్నారు.

గంగనగుంటలో.. సమస్యల పంట

● మౌలిక వసతులు దూరం ● స్పందించని అధికారులు


పూడిపోయిన కాలువ


బురదమయంగా రహదారి

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు. గ్రామాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు అందిస్తున్నా.. పలు గ్రామాలు మౌలిక వసతులకు దూరంగా ఉన్నాయి. మురుగు కాలువలు బాగుచేయక వర్షాకాలంలో నీరంతా ఇళ్ల ముందు చేరుతోంది. రహదారుల అస్తవ్యస్తంగా తయారై చినుకు పడితే చిత్తడవుతున్నాయి. పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు కనీసం కార్మికులు లేని పరిస్థితి. ఇదీ తిరుపతి నగరానికి కూతవేటు దూరంలో ఉన్న గంగనగుంట గ్రామ పరిస్థితి. - న్యూస్‌టుడే, తిరుపతి(నగరం)

తిరుపతి గ్రామీణ మండలం కొత్తూరు పంచాయతీ గంగనగుంట గ్రామంలో కనీసం మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో 350 మంది నివాసం ఉంటున్నారు. మురుగు కాలువలను శుభ్రం చేసి నెలలు గడుస్తోంది. అవి వ్యర్థాలతో నిండి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికులు వాపోతున్నారు. రహదారులు పరిస్థితి దారుణంగా ఉంది. చిన్నపాటి వర్షం పడితే కాలువ నీరు ఇళ్ల ముందు చేరి చెరువును తలపిస్తున్నాయి. రహదారులు నిర్మించాలని స్థానికులు పలుమార్లు అధికారులను విజ్ఞప్తి చేసినా ఫలితం లేదు. చివరకు కాలువలు శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసిన స్పందన లేదని వాపోయారు. గ్రామ సర్పంచ్ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలపై ఆయనకు ఇటీవల చెక్ పవర్‌ను రద్దు చేశారు. పంచాయతీ కార్యదర్శి మునికృష్ణ పిళ్లైకు పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఆయన గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో మౌలిక వసతులు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇళ్లు ముందు వర్షం నీరు...



గ్రామంలోని కాలువల్లో వ్యర్థాలు చేరి మురుగు నీరు ముందుకు వెళ్లడం లేదు. దాదాపు మూడు, నాలుగు నెలల నుంచి కాలువలు శుభ్రం చేయడం లేదు. గతంలో ఓ పారిశుద్ధ్య కార్మికుడు పని చేసేవారు. ఆయనకు పంచాయతీ నెలనెల జీతం ఇవ్వకపోవడంతో ఆయన పనులు చేసేందుకు రావడం లేదు. పంచాయతీ కార్యదర్శి కూడా తమ గోడును పట్టించుకోవడం లేదు.

- మునిరత్నంనాయుడు, గ్రామస్థుడు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం



గ్రామంలో తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. చుట్టు పక్కల గ్రామాల్లో కోతలు లేకుండా సరఫరా అందిస్తుండగా గంగనగుంటకు నిత్యం కోతలు తప్పడం లేదు. విద్యుత్తు శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. గ్రామంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే బురదమయంగా మారుతూ రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉంది.

- విజయరేవతి, స్థానికురాలు


ఆచార్య మునిరత్నంను సత్కరిస్తున్న ముఖ్య అతిథులు

అధ్యాపక వృత్తికి ప్రత్యేక గౌరవం

తిరుపతి(ఎస్వీ విశ్వవిద్యాలయం), న్యూస్‌టుడే: సమాజంలో అధ్యాపక వృత్తికి ప్రత్యేక గౌరవముందని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సవరయ్య పేర్కొన్నారు. సంస్కృత విభాగం అధ్యక్షులు డాక్టర్ మునిరత్నం పదవీవిరమణ సత్కార కార్యక్రమం బుధవారం వర్సిటీలోని ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సవరయ్య మాట్లాడుతూ వర్సిటీలో సంస్కృత విభాగానికి ప్రత్యేక స్థానముందని పేర్కొన్నారు. బోధన, పరిశోధన రంగంలో సంస్కృత విభాగం ప్రతిభను చాటుతోందని కొనియాడారు. సుదీర్ఘ కాలం బోధన, పరిశోధన రంగాల్లో డాక్టర్ మునిరత్నం విశేష సేవలందించారని ప్రశంసించారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపల్ ఆచార్య కిరణ్‌క్రాంత్ చౌదరి, ఆచార్య పద్మనాభం, డాక్టర్ శిరీష, విద్యార్థులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి సినిమా



ప్రతాప్ -	నేనే రాజు నేనే మంత్రి
జయశ్యామ్-	అర్జున్‌రెడ్డి
విఖ్యాత్-	ఆనబెల్
బిగ్‌సినిమా-	లై
వేల్‌రామ్స్-	బాహుబలి 2
జగత్-	అర్జున్‌రెడ్డి
శ్రీనివాస-	నక్షత్రం
కృష్ణతేజ-	నేనేరాజు నేనేమంత్రి
సంధ్య -	వివేకం
సీవీఎస్-	ఆనందోబ్రహ్మ
మినీ ప్రతాప్-	ఫిదా
శ్రీనివాసతేజ-	జంటిల్ మెన్(హిం)
పీజీఆర్-	జయ జానకీ నాయక
తేజ -	గౌతమనంద
ఐ.ఎస్.మహల్-	అంధగాడు
పళణి-	పోదువగ ఎన్ మనసు తంగం(త)

విద్యాపీఠంలో 'ఓనం' పోటీలు

తిరుపతి(బాలాజీ కాలని), న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రంలో పర్వదినమైన 'ఓనం'ను పురస్కరించుకుని పలు పోటీలు బుధవారం విద్యాపీఠంలో జరిగాయి. విభిన్న రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు విద్యాపీఠంలో విద్యాభ్యాసం చేస్తున్న నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు చెందిన ప్రత్యేక పర్వదినాలను నిర్వహిస్తున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో కేరళ విద్యార్థులు ఓనం పండుగను వైభవంగా నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలు పోటీలను బుధవారం నిర్వహించారు. ముగ్గుల పోటీలు, గేయాలాపన తదితర పోటీల్లో కేరళ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు


ఎమ్మెల్సీ దొరబాబును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్

ఎమ్మెల్సీ దొరబాబుకు సత్కారం

తిరుపతి(నగరం), న్యూస్‌టుడే: నంద్యాల ఉప ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన ఎమ్మెల్సీ దొరబాబును బుధవారం తుడా కార్యాలయంలో ఆయన్ని తిరుపతి ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, తెదేపా జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ నంద్యాల ఎన్నికల సమయంలో దొరబాబు అక్కడి ఉండే అభ్యర్థి విజయానికి కృషి చేశారన్నారు. ఆయన తన వంతు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గాలి రాజేంద్రనాయుడు, తుమ్మల గుణశేఖర్‌నాయుడు, రవినాయుడు, పుష్పావతి, సుమ తదితరులు పాల్గొన్నారు.

మెరుగులతో జనం చెవిలో పువ్వులు
రూ.లక్షలు గడిస్తున్న మాఫియా
అక్రమాలకు 'సరిహద్దు' రాజమార్గం

చౌక బియ్యం అక్రమాల పర్వం!

పేదలు మూడు పూటలా పట్టెడన్నం తినాలన్న ఆశయంతో ప్రభుత్వం కోట్లాది రూపాయల రాయితీని భరిస్తూ చౌక దుకాణాల ద్వారా బియ్యం సరఫరా చేస్తోంది. ఈ చౌకబియ్యం అక్రమార్కుల పాలిట సిరులు కురిపిస్తోంది. తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాల్లో చౌక బియ్యాన్ని అక్రమ పద్ధతిలో కొనుగోలు చేసి, వాటికి మెరుగులు దిద్దడం ద్వారా నాణ్యమైన బియ్యంగా ప్రజలను వంచిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ బియ్యం మాఫియా అక్రమాలకు సరిహద్దు నియోజకవర్గం సత్యవేడు ప్రధాన కేంద్రంగా మారింది. తమిళనాడు, ఆంధ్ర నుంచి ప్రభుత్వం సరఫరా చేసే చౌక బియ్యం సరిహద్దు నుంచి శ్రీకాళహస్తి- పలమనేరు మీదుగా కర్ణాటక తదితర ప్రాంతాలకు చేరుతుంది. ఈ బియ్యం అక్రమ రవాణా మూడు పువ్వులు, ఆరు కాయలుగా యథేచ్ఛగా సాగుతోంది.

-న్యూస్‌టుడే, వరదయ్యపాళెం



బీఎన్‌కండ్రిగలో ఇటీవల పోలీసుల దాడుల్లో పట్టుబడిన రేషన్‌బియ్యం

సత్యవేడు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు కూతవేటు దూరంలోనే తమిళనాడు ప్రాంతాలు రావడం. . మరో వైపు వరదయ్యపాళెంనకు ఇటు కి.మీ దూరంలోనే నెల్లూరు జిల్లా ప్రాంతం కూడా చేరడం మాఫియాకు మరో వరంగా మారింది. అందు గలదు.. ఇందు లేదని అనే తేడా లేకుండా మట్టి నుంచి ఇసుక, ఎర్రచందనం వరకు ఈ ప్రాంతాల్లో అక్రమ రవాణాకు కొందరు నాయకులు ఇక్కడే ఎక్కువగా ఉండటం గమనార్హం. కొందరు రాజకీయంగా కూడా ప్రధానపదవుల్లో ఉండటం మరో కొసమెరుపు. ఈ ప్రాంతం సరిహద్దులో ఉండటంతో చౌకబియ్యం తమిళనాడు నుంచి ఇటుగా వక్రమార్గంలో తరలిస్తూ, అక్రమవ్యాపారంతో ప్రతినెలా లక్షలాది రూపాయలు తమ జేబులు నింపుకుంటున్నారు.

తమిళనాడు వయా తడ

పేదలు పస్తులు లేకుండా, కనీసం రెండు పూటలైనా భోజనం చేయాలనే మహోన్నత ఆశయంతో ప్రభుత్వం ప్రతి నెలా రూ.వేలకోట్ల వ్యయాన్ని భరిస్తూ రాయితీపై కిలో బియ్యం రెండురూపాయల చొప్పున సరఫరా చేస్తోంది. తమిళనాడులో సైతం పేదలకు ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తోంది. తమిళనాడులోని పలు పట్టణాల్లో తెల్లరేషన్‌కార్డుదారులు ఈ బియాన్ని భోజనానికి వినియోగించడం లేదు. ఎంతో మంది లబ్ధిదారులు ఈ చౌకబియ్యాన్ని బియ్యం వ్యాపారం చేసే దుకాణాలకు విక్రయిస్తున్నారు. కిలో రూ.6 నుంచి రూ.8 వరకు వీటిని కొనుగోలు చేస్తున్నారు. తమిళనాడులోని పోన్నేరి, మింజూరు, కవర్‌పేట, తండియార్‌పేట, తిరువట్టియూర్, గుమ్మిడిపూండి, రెడ్‌హిల్స్ ప్రాంతాల నుంచి ఈ బియాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఈ కిరాణా దుకాణాల నుంచి ఏజెంట్ల ద్వారా సేకరించి, ఒకే మొత్తంలో ఒక చోట నిల్వ చేస్తారు. ఇలా ఈ నిల్వ చేసిన బియ్యాన్ని అక్కడున్న కొందరు 60 ఏళ్లకు పైగా వయసుగల వృద్ధ సహాయకులతో రైలుమార్గంలో సాధారణ రైలు (చెన్నై-సూళ్లూరుపేట, గుమ్మిడిపూండి-సూళ్లూరుపేట రైలు) ద్వారా తమిళనాడులోని గుమ్మిడిపూండి, పొన్నేరిల నుంచి వరదయ్యపాళెంకు 10 కి.మీ దూరంలో ఉన్న తడకు చేరుకుంటాయి. వీటిని ఇక్కడ ఉన్న ఏజెంట్లు సమీకరించి, సూళ్లూరుపేటలో గల బియ్యం మిల్లులో వీటిని పాలిష్ (మెరుగు) చేస్తారు. అవి నాణ్యమైన బియ్యం తరహాలో ఉంటాయి. ఈ వ్యవహారమంతా శ్రీకాళహస్తికి చెందిన ఇద్దరు మాఫియా వ్యాపారులే నడిపిస్తున్నారని తెలిసింది. గత కొన్నేళ్లుగా వారు ఇదే వ్యాపారాన్ని ప్రధానంగా ఎంచుకొని రూ.లక్షలు గడించారు.

వరదయ్యపాళెం-శ్రీకాళహస్తి-పలమనేరు-కర్ణాటక

ఈ మాఫియా కనుసన్నల్లో సేకరించిన ఈ చౌకబియాన్ని వరదయ్యపాళెం లేదా బీఎన్‌కండ్రిగ మండలాల్లో ఓ ఏజెంటు వీటిని ఆటోల ద్వారా రహస్యంగా ఓ గదిలో తరలించి భద్రపరుస్తారు. రాత్రివేళ్లలో ఒక మినీ లారీ ద్వారా శ్రీకాళహస్తికి తరలిస్తారు. ఇలా శ్రీకాళహస్తిలో మెరుగులు దిద్దిన ఈ బియ్యంను నాణ్యమైన బియ్యంలో కల్తీ చేయడం ఒక రకమైతే.. ఇదే బియాన్ని శ్రీకాళహస్తి నుంచి పలమనేరు మీదుగా కర్ణాటకకు తరలిస్తున్నారు.

ఉత్తుత్తి చర్యలే

పోలీస్ అధికారులు అడపాదడపా కొద్దిస్థాయిలో మాత్రమే ఈ బియ్యం అక్రమ రవాణాపై దాడులు చేస్తున్నారే తప్ప... అటు రెవెన్యూ యంత్రాంగం, పోలీసులు దీనిపై పెద్దగా దృష్టిసారించడం లేదు. వరదయ్యపాళెంలో మూడేళ్ల కిందట ఓ ఇంటిపై విజిలెన్స్ అధికారులు దాడులు చేపట్టి 500పైగా బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అంతస్థాయిలో స్వాధీనం చేసుకున్న దాఖలాలు లేవు. ఆరు నెలల కిందట వరదయ్యపాళెంలో ఓ మినీలారీతోపాటు 200 బస్తాల బియ్యం బస్తాలను పట్టుకున్నారు. ఇటీవల బీఎన్ కండ్రిగ మండలం తలారివెట్టులోని ఓ ఇంటిలో దాచిన 200కిపైగా బియ్యంబస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం చేసుకొని ఉత్తుత్తి కేసులను నమోదు చేస్తుండటంతో అక్రమార్జన రుచి మరిగిన మాఫియా వ్యాపారులు వీటిని ఖాతరు చేయకుండా, మరో మారు ఈ వ్యాపారాలను వదులుకోవడం లేదు. పోలీసులు స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించడం.. అనంతరం వాటిని విడుదల చేయడం పరిపాటిగా మారింది. ఇకనైనా ఈ అక్రమాలకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు.

పేదలెవరు.. సంపన్నులెవరు..

ఈ చౌకబియాన్ని తమిళనాడు నుంచే కాదు.. ఆంధ్ర సరిహద్దులోని సత్యవేడు నియోజకవర్గం మినహాయింపేమీ లేదు. గతంలో ప్రధానంగా ఆంధ్ర నుంచే ఈ అక్రమరవాణా జోరుగా సాగేది. ఇటీవలి కాలంలో ఇక్కడి ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందించే సరకులకు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలతో సరఫరా చేసేలా బయోమెట్రిక్ విధానం, డిజిటల్ తూకపుయంత్రాలు అమల్లోకి రావడంతో ఈ అక్రమాల తీవ్రత స్థాయి తగ్గిందే తప్ప, ఆంధ్ర నుంచి సైతం చౌకబియ్యం ఈ మాఫియాకు చేరుతోంది.

ప్రభుత్వం అందించే ఈ చౌకబియ్యాన్ని సంపన్నులు తీసుకోవడం లేదు. మూడు అంతస్తుల భవనాలు, విలాసవంతమైన వాహనాలు, భూస్వాములు, ఆదాయపన్ను చెల్లించే ఎంతో మందికి తెల్లరేషన్‌కార్డును పంపిణీ చేయడమే ఈ అక్రమానికి మొదటిమెట్టు. ప్రతి మండలంలో తెల్లరేషన్‌కార్డు గల సంపన్నులు ఈ బియాన్ని తీసుకోవడం లేదు. మధ్య తరగతి కుటుంబాలు సైతం ఈ బియాన్ని దుకాణాల్లో విక్రయిస్తుండటం గమనార్హం.

కొందరు కార్డుదారుల నుంచి డీలర్లే వేలిముద్రలతో చౌకబియ్యాన్ని పక్కదారిపట్టిస్తున్నట్లు సమాచారం. పిచ్చాటూరు మండలంలో ఓ ప్రజాప్రతినిధి భర్త ఈ బియ్యం వ్యాపారంలో ప్రధానపాత్ర పోషిస్తున్నారు. పిచ్చాటూరు మండలంలో పౌర సరఫరాల గిడ్డంగి నుంచి వాహనం ద్వారా చౌకదుకాణాలకు బియ్యం బస్తాలను దించే సమయంలోనే ఆ నేత అక్కడే ఒక్కో దుకాణానికి ఒకటి నుంచి రెండు బస్తాల చొప్పున మరో వాహనంలోకి తరలించి అక్రమవ్యాపారానికి పాల్పడుతున్నట్లు సమాచారం. ఈ తతంగం అందరికీ తెలిసినా, మౌనం వహిస్తున్నారు.



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేస్తున్న వర్సిటీ పొరుగు సేవల ఉద్యోగులు

పొరుగు సేవల ఉద్యోగుల నిరసన

ద్రావిడ విశ్వవిద్యాలయం (కుప్పం గ్రామీణ), న్యూస్‌టుడే: కుప్పం ద్రావిడ విశ్వవిద్యాలయంలో పొరుగు సేవల కింద పనిచేస్తున్న ఉద్యోగులు బుధవారం వినూత్నరీతిలో నిరసన తెలియజేశారు. బుధవారం ఉదయం వర్సిటీ ప్రధానద్వారం వద్దకు చేరుకుని మోకాళ్లపై నిలబడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంఘం నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరుని హుండీ ఆదాయం రూ.5.71 లక్షలు

నాగలాపురం, న్యూస్‌టుడే: సురుటుపల్లి పల్లికొండేశ్వరాలయ హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం ఆలయ ఆవరణలో నిర్వహించారు. భక్తులు గడిచిన 44 రోజుల వ్యవధిలో సమర్పించిన కానుకలను లెక్కించగా.. రూ. 5,71,070 వచ్చింది. లెక్కింపును దేవాదాయశాఖ అధికారులు లత, మునిశేఖర రెడ్డి పర్యవేక్షించారు.



హుండీల్లోని నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అంతర్రాష్ట్ర రైలుమార్గానికి సర్వే పూర్తి

ద్రావిడ వర్సిటీ మీదుగా నిర్మాణం మారికుప్పం నుంచి కుప్పం వరకు ౨౦కి.మీ.

గుడుపల్లె,న్యూస్‌టుడే: కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలను కలుపుతూ ద్రావిడ విశ్వవిద్యాలయం మీదుగా కొత్తగా రైలు మార్గం ఏర్పాటుకానుంది. కర్ణాటక సరిహద్దు కేజీఎఫ్ పట్టణం మారికుప్పం నుంచి గుడుపల్లె మండలం మీదుగా కుప్పం రైల్వే స్టేషన్ వరకు సుమారు 21కి.మీ. దీన్ని ఏర్పాటు చేయాలని మూడేళ్ల కిందటే కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకొన్న విషయం విదితమే. దీని ఏర్పాటుకు రైల్వే శాఖాధికారులు మండల పరిధిలో 40 నుంచి 100 మీటర్ల వెడల్పు మార్గాన్ని గుర్తించి సరిహద్దు రాళ్లు పాతారు. అప్పట్లో రైలు మార్గ నిర్మాణం కోసం రూ. 279.54కోట్లు మంజూరు చేశారు. రెండేళ్లుగా ఎటువంటి పనులు జరగలేదు. మదనపల్లె ఉప పరిపాలనాధికారి ఆదేశాల మేరకు రెండు నెలలుగా భూసేకరణ నిమిత్తం డివిజనల్ భూసర్వే పర్యవేక్షణాధికారి రమణ పర్యవేక్షణలో గ్రామాల వారీగా సర్వే పనులు చేపట్టారు. దాదాపుగా పనులు పూర్తయ్యాయని తహసీల్దారు ఆనందకుమార్ తెలిపారు. గుడుపల్లె మండలం పరిధిలో 12 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 247.75 ఎకరాలు, కుప్పం మండలం పరిధిలోని చిన్న కుర్లపల్లె గ్రామం పరిధిలో 18.30 ఎకరాల భూములు కేటాయించాల్సి ఉంటుందని సర్వేలో వెల్లడైంది. ఈ భూముల్లో పలువురు రైతులకు చెందిన పట్టాభూములు, ప్రభుత్వ భూములు కలిపి 265 ఎకరాలున్నట్లు సర్వేలో స్పష్టం అయిందన్నారు. కుప్పిగానిపల్లె, పొగురుపల్లె, మల్దేపల్లె, అగరం, బిసానత్తం రెవెన్యూ గ్రామ పరిధిలోని భూముల వివరాల భూసేకరణ కోసం మదనపల్లె ఉప పరిపాలనాధికారి కార్యాలయానికి నివేదికలు పంపినట్లు తహసీల్దారు తెలిపారు.



రైల్వే మార్గం నిర్మాణానికి గుర్తించిన భూములను చూపుతున్న స్థానికుడు

సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా...

రీజినల్ కౌన్సిల్ సమావేశంలో కార్మికులకు పిలుపు

తిరుపతి(ఆర్టీసీ), న్యూస్‌టుడే: ఆర్టీసీని సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా నడిపించడమే ధ్యేయంగా ఎన్ఎంయూ పనిచేస్తోందని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. తిరుపతి యూత్ హాస్టల్లో బుధవారం ఎన్ఎంయూ రీజినల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు అర్జునయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పటిష్ఠ న్యాయకత్వంలో ఎన్ఎంయూ ఏకైక ఆర్టీసీ యూనియన్‌గా నిలవనున్న తరుణం ఆసన్నమైందన్నారు. నాయకులు కార్మికులకు నిత్యం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సెప్టెంబర్ 12వ తేదీన విజయవాడలో జరిగే గోల్డెన్ జూబ్లీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్నారని, పెద్ద ఎత్తున కార్మికులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కింది స్థాయి క్యాడర్ ఎన్ఎంయూకు బలంగా ఉందని ఏ శక్తి ఏమి చేయలేదని, ఆర్టీసీని కొత్త పుంతలు తొక్కించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యత్వం, భవిష్యత్తు ప్రణాళికలపై తీర్మానాలు చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎల్ఎల్వి రమణరావు, ఛైర్మన్ జీవి ముని, అధ్యక్షులు అర్జునయ్య, రాష్ట్ర కార్యదర్శులు బి.ఎస్.బాబు, కె. వెంకటేశ్వర్లు, కె.శ్రీకర్‌రెడ్డి, ఎంవీరావు, ఆహ్వానితులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు

'కిస్' విశ్వవిద్యాలయం వీసీగా హరేకృష్ణ శతపతి

తిరుపతి(బాలాజీకాలని), న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లోని 'కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్సెస్(కిస్) విశ్వవిద్యాలయం ప్రప్రథమ ఉపకులపతిగా ఆచార్య హరే కృష్ణ శతపతి నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. ఆచార్య హరేకృష్ణ శతపతి పది సంవత్సరాల పాటు తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠానికి ఉపకులపతిగా సేవలందించి గతేడాది పదవీకాలాన్ని పూర్తిచేశారు. సంస్కృతంలో నాలుగు దశాబ్దాల బోధన, పరిశోధన అనుభవాన్ని సంపాదించుకున్న ఆయన మంచి పరిపాలకులుగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా విద్యాపీఠం సీనియర్ ఆచార్యులు, వేదవర్సిటీ మాజీ వీసీ ఆచార్య సన్నిధానం సుదర్శన శర్మ తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



కాణిపాకం ఆలయంలో విద్యుదాఘాతం



కాణిపాకం ఆలయంపై ఏసీ నుంచి పొగలు వచ్చిన ప్రదేశం

కాణిపాకం, న్యూస్‌టుడే: స్వయంభు శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి ఆలయంలోని అంతరాలయానికి సంబంధించి విమాన గోపురం వద్ద ఉన్న ఏసీ మిషన్ వద్ద బుధవారం ఉదయం విద్యుత్తు అపసవ్య ప్రవాహం వలయం (షార్ట్ సర్క్యూట్) సంభవించింది. అధికారులు తెలిపిన వివరాల మేరకు... అంతరాలయంలో ఏసీ వద్ద ఉన్న తీగలు కాలిపోయాయి. అక్కడ పొగలు వ్యాపించాయి. పలువురు భక్తులు స్వల్పంగా విద్యుదాఘాతానికి గురయ్యారు. విషయాన్ని వారు ఆలయ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని విద్యుత్తు రాకుండా చర్యలు తీసుకున్నారు. పలితంగా పెనుప్రమాదం తప్పింది. గతంలోనూ ఇదే విధమైన సంఘటన ఆలయంలో చోటు చేసుకుంది. పటిష్ఠ భద్రత చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

మరొకరికి తీవ్రగాయాలు



మృతి చెందిన లక్ష్మమ్మ

పొన్నమాకుపల్లె(గంగవరం), న్యూస్‌టుడే: కారు ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి గంగవరం మండలంలో చోటుచేసుకుంది. పెద్దపంజాణి ఎస్సై రాజశేఖర్ కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలానికి చెందిన లక్ష్మమ్మ(59), అల్లుడు నారాయణప్ప(35) సొంతపనిపై పుంగనూరు మండలానికి వెళ్లారు. తిరిగి అల్లుడు స్వగ్రామమైన కీలపల్లి గ్రామానికి వెళ్లేందుకు బుధవారం రాత్రి వీరిద్దరూ కాలినడకన చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి పక్కన పొన్నమాకులపల్లె గ్రామ సమీపంలో వెళుతుండగా మార్గ మధ్యలో బెంగళూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో లక్ష్మమ్మకు బలమైన గాయమవటంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందారు. అల్లుడు నారాయణప్పకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పెద్దపంజాణి ఎస్సై రాజశేఖర్ వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించారు. వాహనం తారురోడ్డును దాటుకుని మట్టిరోడ్డుపై వెళుతున్న పాదచారుల్ని ఢీకొన్నట్లు అనుమానిస్తున్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రుణ్ని వెంటనే పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గంగవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారణమేమిటంటే.?

(మొదటి పేజీ తరువాయి) విశ్లేషించి, పరిష్కారాలను చూపే బాధ్యతను ఈ విభాగాలు ఉమ్మడిగా భుజానికెత్తుకున్నాయి. ఈ దిశగా తొలి అడుగు పడింది.

శాస్త్రీయంగా ఆర్టీసీ పరిశీలన

రహదారి ప్రమాదాల్లో కొన్ని చోదకుల తప్పిదాల వల్ల జరుగుతుండగా, మరికొన్ని చోట్ల రోడ్ల నిర్మాణంలోని లోపాలు కారణంగా కన్పిస్తున్నాయి. తొలుత పోలీసులు జిల్లావ్యాప్తంగా సర్వే చేయగా.. 320 ప్రాంతాలు ప్రమాదాలకు ఆస్కారమున్నవిగా తేలింది. ఆ తర్వాత జులైలో ఆర్టీసీ అధికారులు ప్రత్యేకంగా సర్వే చేశారు. జిల్లాలోని 14 డిపోల్లోంచి నలుగురు చొప్పున సిబ్బంది ఐదు రోజుల పాటు జాతీయ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ రహదారుల వెంట తిరిగి పరిశీలించారు. సర్వే శాస్త్రీయంగా ఉండేలా సిబ్బందికి స్మార్ట్ సెల్‌ఫోన్లు ఇచ్చి.. ప్రతి ప్రమాదకర ప్రాంతాన్ని ఫొటో తీయించారు. ప్రత్యేకంగా రూపొందించిన 'ఎండ్ లొకేషన్' అనే యాప్‌లో వీటిని పొందుపర్చారు. ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారమున్న కూడళ్లు, మలుపులు, వారధులకు సంబంధించి ఆర్టీసీ డ్రైవర్లు ఇచ్చిన సమాచారాన్నీ.. ఈ యాప్ ద్వారా నిర్ధారించారు. ఎండ్ లొకేషన్ యాప్ ద్వారా ఆయా స్థలాల రేఖాంశం, అక్షాంశాలను గుర్తించారు. తద్వారా ఆయా ప్రాంతాలకు త్వరగా చేరుకోవడానికి, తదుపరి మరమ్మతులు చేపట్టడానికి సులువుగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. 400 ప్రాంతాల ఫొటోలు, అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక రూపొందించి.. ఇటీవల జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్నకు అందజేశారు. తదనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

ప్రమాదాలకు పలు కారణాలు

రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారినా.. ఇప్పటి వరకూ వీటిపై శాస్త్రీయ విశ్లేషణ జరగలేదు. ఎక్కువ కేసుల్లో డ్రైవర్లనే బాధ్యులను చేస్తూ.. మూలకారణాలను విస్మరిస్తున్నారు. సమస్య మూలాల్లోకి వెళ్లి, పరిశీలించి నివారణ దిశగా తగిన కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకే అధికారులు సర్వే చేసి, నివేదిక రూపొందించారు. రహదారుల నిర్మాణంలో లోపాలు, సూచిక బోర్డులు లేకపోవడం, చెట్ల కొమ్మలు రోడ్లపైకి వ్యాపించడం, వేగ నిరోధకాలు లేకపోవడం ప్రధాన కారణాలుగా అధికారులు విశ్లేషించారు. వీటన్నింటినీ క్రోడీకరించి ఆర్టీసీ తిరుపతి ప్రాంతీయ మేనేజర్ నాగశివుడు కలెక్టర్‌కు నివేదించారు.

ఈ మార్గమే ఓ నమూనా

రహదారుల భద్రతకు సంబంధించి ఆర్అండ్‌బీ, రవాణా, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖలతో కలిపి సంయుక్తంగా కార్యాచరణ చేపట్టారు. తొలుత రేణిగుంట-రాయలచెరువు రహదారిని రూ.10.85 కోట్ల వ్యయంతో నమూనా కారిడార్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఈ మార్గంలో ఎనిమిది మలుపులు, 10 కూడళ్లు ఉన్నాయి. రోడ్డు పక్కన ట్రక్కులు నిలిపేందుకు ఒక లే బే జోన్లు, మూడు రహదారి భాగాలను మెరుగుపర్చాలని ప్రతిపాదించారు. ఈ పనులను 2014లో ప్రారంభించగా 2015 జూన్‌లో రూ.9.81 కోట్లతో పూర్తి చేశారు. మలుపు/కూడళ్లను విశాలం చేయడం ద్వారా ప్రమాదాలను నిరోధించగలిగినట్లు అధికారులు గుర్తించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా రేణిగుంట-కడప రహదారిపై సుమారు రూ.35 కోట్ల వ్యయంతో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను పటిష్ఠం చేసింది. ఇక్కడ ట్రాఫిక్ పెట్రోలింగ్‌ను పెంచింది. తద్వారా కొద్ది రోజులుగా ప్రమాదాలు గణనీయంగా తగ్గించగలిగినట్లు గుర్తించారు. కేటాయించిన రూ.35 కోట్లలో సుమారు రూ.29 కోట్లతో రోడ్డు మరమ్మతులు చేశారు. పోలీస్, రవాణా శాఖలకు వాహనాలు, పరికరాలు అందించారు. ఇది సత్ఫలితాలు ఇస్తుండటంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన రహదారులపై ఇదే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

గోవిందుడి చెంతకు కోవిందుడు

(మొదటి పేజీ తరువాయి) మైదానంలో రాష్ట్రపతికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పౌర సన్మానం చేయనున్నారు. పర్యటనకు సంబంధించి అధికారికంగా షెడ్యూలు ఖరారు కావడంతో అధికారులు ఏర్పాట్లలో తలమునకలయ్యారు. బుధవారం తిరుపతి సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ పి.ఎస్.ప్రద్యుమ్న అధికారులతో సమీక్షించారు. తితిదే జేఈవో పోలా భాస్కర్, తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, జిల్లా సంయుక్త కలెక్టర్ గిరీషా, జేసీ-2 చంద్రమౌళి, తిరుపతి సబ్‌కలెక్టర్ నిశాంత్‌కుమార్, శిక్షణ కలెక్టర్ కీర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రద్యుమ్న మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రపతి పర్యటన అధికారికంగా ఖరారైందని, పండుగ వాతావరణంలో నిర్వహించాలని ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయని వెల్లడించారు. అన్ని అంశాల్లోనూ తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్రపతితోపాటు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. శుక్రవారం సాయంత్రం తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో రాష్ట్రపతికి ప్రభుత్వం పౌర సన్మానం ఉంటుందని, అక్కడే రూ.25 కోట్ల వ్యయంతో ఆస్వాన్ పేరుతో నిర్మించనున్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నైపుణ్యాభివృద్ధి అకాడమీకి శంకుస్థాపన చేస్తారని చెప్పారు. ఈ అకాడమీని తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు సుముఖత వ్యక్తం చేసిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్, ఎండీలు కూడా కోరిన వెంటనే ఆమోదం తెలియజేసినందుకు వారికి ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలోనే 'స్టాండప్ ఇండియా' కింద ఎస్సీ, ఎస్టీలకు పరిశ్రమల ఏర్పాటుకు రుణాలను అందించే కార్యక్రమాన్ని కొందరు లబ్ధిదారులకు రాష్ట్రపతి చేతుల మీదుగా అందించడం ద్వారా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో రూ.3 లక్షల వరకు రుణాలు అందించేవారని, స్టాండప్ ఇండియాలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మహిళా పారిశ్రామికవేత్తలకు రూ.2 కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. భూ కొనుగోలు పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు భూమి పట్టాలను అందించే కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశామని ప్రద్యుమ్న వివరించారు. ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి లబ్ధిదారులకు అందించేందుకు ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలిపారు. తంబళ్లపల్లి, వాల్మీకిపురం మండలాల్లో 120 ఎకరాలను కొనుగోలు చేసి 500 మంది లబ్ధిదారులకు రాష్ట్రపతి అందిస్తారని చెప్పారు. పౌర సన్మాన సభకు స్విమ్స్, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, స్వయం సహాయ బృందాల మహిళలు కలిసి సుమారు 5 వేల మంది పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాలు ముగిసిన తర్వాత శిల్పారామంలో రాష్ట్రపతికి ప్రభుత్వ విందు ఏర్పాటు చేశామని ఇందులో జిల్లాకు చెందిన 150 మంది ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. భద్రత పరంగా పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

జాగ్రత్తగా నిర్వహించాలి

అంతకుముందు సమీక్ష సమావేశంలో అధికారులకు కలెక్టర్ ప్రద్యుమ్న పలు సూచనలు చేశారు. రాష్ట్రపతి పర్యటనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కార్పొరేషన్ అధికారులు నగరాన్ని శుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తుడా ఆధ్వర్యంలో విమానాశ్రయం సుందరీకరణకు సూచనలిచ్చారు. సబ్‌కలెక్టర్ జారీ చేసిన పాసులున్న వారినే కార్యక్రమాలకు అనుమతించాలని స్పష్టం చేశారు. అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచుకోవాలని వెల్లడించారు. శుక్రవారం రాత్రి రాష్ట్రపతి తిరుమలలో బస చేయనున్న నేపథ్యంలో అక్కడ లైజెనింగ్ అధికారులుగా సంబంధిత తహసీల్దార్లు ఉండాలని తెలిపారు. పోలీసుల సూచనల మేరకు పార్కింగ్ చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. అనంతరం పౌర సన్మానం జరిగే ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానాన్ని అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు.

కూలి రాక.. ఆకలి కేక

(మొదటి పేజీ తరువాయి) లక్ష్యం పూర్తి కాలేదు. పంచాయతీ భవనాలు, ఎవెన్యూ ప్లాంటేషన్, పండ్ల తోటల పెంపకం చేపడుతున్నారు. ఈ పనులకు సంబంధించి సుమారు రూ.12 కోట్ల వరకూ బకాయిలు రావాల్సి ఉంది. చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు అందకపోవడంతో గుత్తేదారులుగా వ్యవహరిస్తున్న గ్రామస్థాయి నేతలు పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో అభివృద్ధి పనుల్లో ప్రగతి కనిపించడం లేదు.

గృహ నిర్మాణానికి రూ.4 కోట్లు

ఎన్టీఆర్ గృహ నిర్మాణానికి 35 శాతం నిధులు ఉపాధి హామీ పథకం నుంచి కేటాయించారు. ఒక్కో ఇంటి (యూనిట్) నిర్మాణ వ్యయం రూ.1.5 లక్షలు. ఇందులో రూ.95 వేలు గృహ నిర్మాణ సంస్థ నుంచి చెల్లిస్తారు. మిగిలిన రూ.55 వేలు పునాదుల స్థాయి నుంచి శ్లాబ్ దశ వరకూ వివిధ దశల్లో ఉపాధి హామీ నుంచి లబ్ధిదారుల ఖాతాకు జమ చేస్తారు. ఇందులో 90 రోజుల పని దినాల విలువగా రూ.17,460 ఇటుకల తయారీకి, రూ.25,540 మరుగుదొడ్డి నిర్మాణానికి చెల్లిస్తారు. జిల్లాలో మంజూరైన గృహాల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటి చెల్లింపులకు రూ.4 కోట్లు బకాయిలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇళ్లు నిర్మించుకుంటున్నా సకాలంలో బిల్లులు అందక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి హామీ నిధులు సక్రమంగా అందితే కొంతవరకూ పనుల్లో పురోగతి ఉంటుందని గృహ నిర్మాణ శాఖ అధికారులంటున్నారు.

సరాసరి వేతనం రూ.159

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో 6.54 లక్షల జాబ్ కార్డులున్నాయి. ప్రస్తుతం రూ.889 కోట్లు విలువైన 49,679 పనులు జరుగుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 74.53 లక్షల దినాలు వేతనదారులు పని చేశారు. ఇప్పటి వరకూ 10,898 కుటుంబాలు వంద రోజులు పని పూర్తి చేసుకున్నాయి. వేతనాలు, మెటీరియల్ రూపంలో రూ.162 కోట్లు ఖర్చు చేశారు. జాబ్ కార్డులు కలిగిన కుటుంబాలు సగటున 40 రోజులు పని చేయగా, రోజుకు గిట్టిన సరాసరి వేతనం రూ.159.64 పైసలు.

రూ.50 కోట్ల బకాయిలు

ఉపాధి హామీ పథకం ద్వారా చెల్లించాల్సిన బకాయిలు జిల్లాలో రూ.50 కోట్లు ఉన్నాయి. గత రెండు నెలలుగా వేతన చెల్లింపులు జరగలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధుల విడుదలలో జాప్యమే ఇందుకు కారణం. కూలీల ఇబ్బందులు, అభివృద్ధి పనులకు కలుగుతున్న ఆటంకాన్ని ప్రభుత్వానికి నివేదించాం. ముఖ్యమంత్రి నిధుల విడుదల చేయించేందుకు చొరవ చూపుతున్నారు. మరో రెండు రోజుల్లో బకాయి ఉన్న నిధులు విడుదల కానున్నట్లు సమాచారముంది. వచ్చిన వెంటనే లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తాం. పనులు పుంజుకునేలా చర్యలు చేపడుతాం. **- డ్వామా పీడీ కూర్మనాథ్**

- మురుగు కాల్వలు ఆక్రమణ
- చెరువుల నిర్వహణ గాలికి
- విపత్తు వస్తే ముప్పే
- ఇదీ తిరునగరి పరిస్థితి
- హైదరాబాద్, ముంబయి, చెన్నై వరదలతో అప్రమత్తత అవసరం

వానొస్తే.. వణుకే



2015 డిసెంబర్‌లో భారీ వర్షాలకు జలమయమైన నెహ్రూనగర్

2015 లో...

వాయుగుండం ప్రభావంతో 2015 డిసెంబరు మొదట్లో తిరుపతిని వర్షాలు ముంచెత్తాయి. సుమారు 15 రోజులపాటు వర్షాలు పడటంతో నగరం జలమయమైంది. ప్రధానమైన కూడళ్లు, వీధులు నీట మునిగాయి. కనీసం బయటకు రాలేని పరిస్థితి. తిరుపతిలో సుమారు 22 సెంమీ వర్షం పడటం రికార్డుగా నమోదైంది. నెహ్రూనగర్, కొర్లగుంట, పెదకాపులేఅవుట్, మారుతీనగర్, సంజయ్‌గాంధీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇళ్లన్నీ నీటి మునిగిపోయాయి. రోడ్లు కనిపించనంతగా వర్షం పడింది.



నిర్వహణ కరవైన అక్కారంపల్లి చెరువు

తిరుపతి జనాభా
3,74,260 (2011 లెక్కల ప్రకారం)

విస్తీర్ణం **27.44** చదరపు కిమీ

పక్కా డ్రెయిన్లు **289** కిమీ

కచ్చా డ్రెయిన్లు **10** కిమీ

వరద డ్రెయిన్లు **42.02** కిమీ

ముంపు ప్రాంతాలు **19**

మురికి వాడలు **69**

మురికివాడల్లో నివసిస్తున్న జనాభా **1,89,990**

మొన్న చెన్నై.. నిన్న పొరుగున హైదరాబాద్.. నేడు దేశానికే వాణిజ్య రాజధాని ముంబయిని వరదలు ముంచెత్తాయి. కనీసం నగరాలే కనిపించనంత విలయాన్ని సృష్టిస్తున్నాయి. 2015 డిసెంబరు 1 అర్ధరాత్రి.. చెన్నై నగరానికి పీడకల. వరుణుడు ప్రకోపించి చెన్నైతో పాటు.. దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో బీభత్సం సృష్టించాడు. డిసెంబరు 2 ఉదయం 8.30 గంటల సమయానికి వర్షం కాస్త తగ్గుముఖం పట్టింది. చెన్నై పట్టణ వాసులంతా ఇళ్లలో నుంచి బయటకొచ్చి చూస్తే కనుచూపు మేరలో ఎక్కడా భూమి కనిపించడం లేదు. పలు ప్రాంతాల వారు బయటకు రాలేని పరిస్థితి. కేవలం 10 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో చెన్నై నగరంలో 34 సెంమీ వర్షపాతం నమోదైంది.

✷ ఇటీవల హైదరాబాద్‌లో ఒకరోజులో 15 సెంమీ వర్షానికి నగరం అతలాకుతలం అయింది. వాహనాలు కొట్టుకుపోయాయి. రోడ్లపై నీరంతా ఇళ్లలోకి చేరింది. కొన్ని బహుళ అంతస్తులు సైతం మునిగిపోయాయి.

✷ నేడు ముంబయి మహా నగరం వర్షాలతో తడిసి ముద్దవుతోంది. రోడ్లన్నీ సముద్రాలుగా మారిపోయాయి. ఏకధాటిగా కురిసిన వర్షం అరేబియా సముద్రమే ముంబయిలో కలిసిపోయిందా అన్నట్లు పరిస్థితి కనిపిస్తోంది. ఈనాడు, తిరుపతి

● 2017 ఆగస్టు 20 ఆదివారం సాయంత్రం 7 గంటలు. అప్పటికప్పుడు మబ్బులు దట్టంగా కమ్ముకునితిరుపతి నగరాన్ని వరుణుడు సరదాగా పలకరించాడు. గంటన్నర పాటు వర్షం పడింది. అదేనెల 27వ తేదీ రాత్రి చాలాసేపు వర్షం కురిసింది. అది కేవలం ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల జోరువాన. దానికి నగరవాసులు చిగురుటాకులా వణికిపోయారు. లోతట్టు ప్రాంతాల్లో మోకాలిలోతు నీరొచ్చింది. వాహనాలు కదల్లేని పరిస్థితి. ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎందుకిలా.. ఇంత చిన్నపాటి వానకే నగరం ఇలా అయితే మరీ... చెన్నై లాంటి విపత్తు వస్తే ఏంటీ పరిస్థితి..? దాన్ని ఎలా ఎదుర్కోగలం..? అంటే ఎవరి వద్దా సమాధానం లేదు. వచ్చేది వర్షాకాలం.. ఇప్పటికీ నగరపాలక సంస్థ దగ్గర విపత్తులను ఎదుర్కొనే ఏ ప్రణాళిక లేదు. కనీసం సమస్యలను అధిగమిద్దామనే ఆలోచనే వారికి లేదంటే నమ్మక తప్పదు.

ఏ డ్రెయిన్ చూసినా ఏమున్నది గర్వకారణం..

తిరుపతికి ప్రధానంగా ఉన్నవి, కీలకమైనవి కపిలతీర్థం, మల్వాడిగుండం డ్రెయిన్లు. ఇవే కాకుండా మరో 12 డ్రెయిన్లు నగరం నుంచి వెళ్తాయి. ఇవి 90 శాతం ఆక్రమణలే. మల్వాడిగుండం మొదట సుమారు 50 మీటర్ల మేర వెడల్పుతో కనిపిస్తే కొద్దిదూరం వెళ్లే సరికే అది 10 మీటర్ల మేర కుచించుకుపోయి కనిపిస్తోంది. కపిలతీర్థం డ్రెయిన్‌ది ఇదే పరిస్థితి. కొండపై నుంచి వచ్చే నీటితో పాటు, నగరంలోని ఇళ్ల మురుగునీరు దీనిలో భారీగా కలుస్తోంది. డ్రెయిన్ చుట్టు పక్కల ప్రాంతాలన్నీ ఆక్రమించారు. దీంతో ఎర్రమిట్ట సమీపంలో డ్రెయిన్ వెడల్పు 5 మీటర్లకు తగ్గిపోయింది. నగరంలో ఉన్న 12 ప్రధాన డ్రెయిన్ల పరిస్థితి ఇలాగే ఉంది. కాస్త వర్షం పడినా నీరు వెళ్లే దారి లేక ఇళ్లన్నీ మునిగిపోతున్నాయి. ఇక ఉన్న డ్రెయిన్లు అనేక మలుపులు, వంకర్లు తిరుగుతూ వెళ్లడంతో సీల్టు భారీగా పేరుకుపోతోంది. ఇదే పరిస్థితి చెన్నైది కూడా... అక్కడున్న డ్రెయిన్లలో పెద్దపెద్ద భవంతులు కట్టడంతోనే 2015 విపత్తు అంత భారీగా వచ్చిందని నిపుణులు తేల్చారు.



మల్వాడీగుండం నీరు వెళ్లేందుకు ప్రారంభంలో కాలువ విశాలంగా..



కొద్ది దూరం తరువాత యశోదానగర్ వద్ద ఇలా కుచించుకుపోయి...

చెరువుల చిరునామా ఎక్కడ ?

తిరుపతి నగరంలో గతంలో 22 చెరువులు ఉండేవి. వీటిని చాలావరకు పూడ్చేశారు. వీటిలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు వెలిశాయి. మరికొన్ని లేఅవుట్‌లు వేసి.. ప్లాట్లు చేసి అమ్ముకున్నారు. ఇక డ్రెయిన్లు కలిసే కొన్ని చెరువులు నిండిపోయి... అవుట్‌ఫ్లో లేక మురుగువాసన వస్తున్నాయి. దానిలోకి వెళ్లే డ్రెయిన్‌నీటితో చుట్టుపక్కల వారు ఉండలేకపోతున్నారు. కేవలం డ్రెయిన్ నీరు వదిలేయడమే తప్ప... వాటి నిర్వహణను కార్పొరేషన్ పట్టించుకోవడం లేదు. దీంతో చెరువుల్లో కొన్ని ఆక్రమణల పరం కావడంతో పాటు, మరికొన్ని నిర్వహణ కరవయ్యాయి. తిరుపతిలోని అనేక ప్రాంతాలకు ఇప్పటికీ పూర్తిస్థాయి రిజిస్ట్రేషన్ పట్టాలు లేవు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ హౌసింగ్ స్కీం కోసం వచ్చిన దరఖాస్తుల్లో 15 శాతం మాత్రమే పూర్తిస్థాయిలో అన్నీ అనుమతులు పొందినట్లు తేలింది. మిగిలినవన్నీ చెరువులు, కుంటల ప్రాంతాల్లో ఉండటంతో వాటికి అధికారులు అనుమతులను ఇవ్వలేకపోయారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించారు.



కపిలతీర్థం కాలువ ఎర్రమిట్ట వద్ద వంకర్లు తిరుగుతూ ఆక్రమణలతో ఇలా..

మొదలుపెడితే ఆపేస్తారు...

ఆక్రమణలపై గతంలో అధికారులు దృష్టి పెట్టినా ఫలితం లేకుండా పోయింది. ఆక్రమణలు తొలగించే లోపే కొందరు కోర్టు ఆర్డర్లు తెస్తున్నారని, దీంతో తామేమీ చేయలేకపోతున్నామని అధికారులు వాపోతున్నారు. డ్రెయిన్లపై భవంతులు నిర్మించిన కొందరు ఇళ్ల యజమానులకు ముందుగానే సమాచారం వెళ్తోందని దీంతో వారు స్టే ఆర్డర్లతో సిద్ధంగా ఉంటున్నారని ఓ అధికారి వాపోయారు. కొంత ఇంటి దొంగల పని ఉంది. అధికారులు ఓ విషయాన్ని రహస్యంగా ఉంచి.. ఆక్రమణల పనిపట్టాలని పథకం వేసినపుడు ఆ సమాచారం ముందుగానే బయటకు పొక్కుతోంది. దీంతో ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయితే దీనికి తగ్గట్లుగా కార్పొరేషన్ లీగల్ సెల్‌ను బలోపేతం చేసి.. ఆక్రమణదారులకు ముకుతాడు వేస్తే కాస్త ప్రయోజనం ఉంటుందని నగరవాసులు అంటున్నారు.



వానొస్తే.. ఇలా ఇల్లంతా జలమయమే

'స్మార్ట్'గా దృష్టి పెడితేనే...

తిరుపతి స్మార్ట్ సిటీగా మారింది. మిగిలిన రాయలసీమ ప్రాంతంతో పోలిస్తే నగరంలో వర్షపాతం ఎక్కువ. సగటున ఏడాదికి 860 మిమీ నుంచి 1050 మిమీ వర్షపాతం నమోదు అవుతోంది. ఇక అత్యధికంగా 1450 మిమీ వర్షం పడుతోంది. స్మార్ట్ నగరానికి కేంద్రం నుంచి, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వేగంగా నిధులొస్తున్నాయి. సుమారు రూ.184కోట్ల నిధులు సిద్ధంగా ఉన్నాయి. వాటిని వరద ముంపు నివారణకు, డ్రెయిన్ల మరమ్మతులకు, ఆక్రమణల తొలగింపునకు ఖర్చు చేస్తే చాలావరకు ఫలితం ఉంటుంది. స్మార్ట్ నిధులు వినియోగించుకొని గుంటూరు కార్పొరేషన్ భూగర్భ డ్రెయినేజీను నిర్మిస్తోంది. ఆ దిశగా తిరుపతి నగరానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

దృష్టి పెడతాం

డ్రెయిన్లపై ఆక్రమణలు ఉంటే సహించేది లేదు. ఇటీవల నేను క్షేత్రపర్యటనకు వెళ్లిన సందర్భంగా డ్రెయిన్లపై కట్టిన నిర్మాణాలు అప్పటికప్పుడు తొలగించాం. ఇదే పద్ధతి అన్నీ ప్రాంతాల్లోనూ ఉంటుంది. అవసరమైతే ప్రత్యేక డ్రైవ్ చేస్తాం. ఎక్కడెక్కడ ఆక్రమణలు ఉన్నాయో త్వరలో గుర్తించి చర్యలు తీసుకుంటాం.

- హరికిరణ్, కమిషనర్, నగరపాలక సంస్థ

రైల్వే కార్మికులకు.. సాంత్వన



సబ్‌డివిజనల్ ఆసుపత్రి భవనం



నూతన ఆసుపత్రి భవనం ఇదే..

● సీఆర్ఎస్ సబ్ డివిజనల్ ఆసుపత్రిగా మార్పు
● అందుబాటులోకి అత్యాధునిక వైద్య పరికరాలు

రేణిగుంట సీఆర్ఎస్ ఆసుపత్రి ఆవరణలోని ఖాళీ ప్రదేశంలో ఆధునిక ఆసుపత్రిని నిర్మించాలని రైల్వే ఇంజినీర్లు ప్రణాళిక రూపొందించారు. ఇక్కడైతే అటు కడప వైపు నుంచి... ఇటు పాకాల నుంచి వచ్చే రైల్వే కార్మికులతో పాటు సీఆర్ఎస్ ఉద్యోగులకూ అందుబాటులో ఉంటుందని అంచనా వేశారు. రైల్వే కార్మికులు, వారి కుటుంబాలు ఆర్థికంగా ఎటువంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు రైల్వేశాఖ ముందుకు వచ్చింది. రేణిగుంట, సీఆర్ఎస్, తిరుపతి ప్రాంతాల రైల్వే కార్మికులకు ఇప్పటివరకు ఒక్క రేణిగుంటలోనే రైల్వే ఆసుపత్రి ఉంది. అదీ ఎప్పడిదో కావడంతో వచ్చే రోగుల రద్దీకి అనుగుణంగా వైద్య సేవలు కుదరడంలేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైల్వేశాఖ ఉన్నతాధికారులు రూ.7 కోట్ల వ్యయంతో 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను చేపట్టారు. ఇందులో రూ.5 కోట్ల వ్యయంతో భవనాల నిర్మాణం, ఎలక్ట్రికల్, ఇతర వాటికి ఖర్చు చేశారు. మిగతా రూ.2 కోట్ల వ్యయంతో ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చారు.

గతంలో

రైల్వే ఉద్యోగులు, కార్మికులకు ఎటువంటి ఆరోగ్య సమస్య వచ్చినా తిరుపతి ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి అధిక మొత్తంలో చెల్లించి చికిత్స పొందేవారు. ఇక్కడ ఉన్న రైల్వే ఆసుపత్రిలో మాత్రం చిన్న వ్యాధులకు మాత్రమే వైద్యం చేసే వారు. ఈ సమస్యపై రైల్వే కార్మికులు ఇక్కడికి వచ్చిన ప్రతి అధికారికి తమగోడును విన్నవించారు. గుంతకల్లు తరవాత ఎక్కడా రైల్వే కార్మికులకు డివిజనల్ ఆసుపత్రి లేదు. అక్కడికి వైద్యం నిమిత్తం వెళ్లాలంటే... 7 నుంచి 8 గంటలు ప్రయాణ సమయం పడుతుంది. ఈ సమస్యలను గుర్తించిన ఉన్నతాధికారులు ఇక్కడ సబ్‌డివిజనల్ ఆసుపత్రిని ఇటీవల నిర్మించి అన్ని ఆధునిక హంగులను కల్పించారు. రైల్వేబోర్డు ఛైర్మన్ ఏకే మిట్టల్ ఇటీవల ప్రారంభించడడంతో వైద్య సేవలు ప్రారంభమయ్యాయి.

- న్యూస్‌టుడే, రేణిగుంట



▲ మహిళా వార్డు

వీరే వైద్యులు.. సిబ్బంది

ప్రస్తుతం ఇక్కడ ముగ్గురు వైద్యులు నిత్యం అందుబాటులో ఉన్నారు. వీరితో పాటు ఐదుగురు నర్సులు, ఇద్దరు ఫార్మసిస్టులు, ఇక ల్యాబ్ సూపరింటెండెంట్, డ్రస్సెర్, నలుగురు అటెండర్లు, ఒక ఆఫీసు సూపరింటెండెంట్, ఒక రేడియోగ్రాఫర్, శుభ్రత సిబ్బంది మొత్తం 23 మంది సేవలందిస్తున్నారు. 11 మంది వైద్యులు తరుచూ విజిట్ చేస్తుంటారు. వారంలో రెండు లేదా మూడు రోజులు వారికి కేటాయించిన దినాల్లో సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు అందుబాటులో ఉంటారు.



కంటి పరీక్షల కేంద్రం

34 వేల మందికి లబ్ధి

రేణిగుంట సెక్షన్‌లో 2,800 కార్మికులు, పదవి విరమణ కార్మికులు 804, సీఆర్ఎస్‌లో 1,800, పదవి విరమణ 550, పాకాల సెక్షన్‌లో 1026, పదవి విరమణ 484, నందలూరు సెక్షన్‌లో 888, పదవి విరమణ కార్మికులు 350 మొత్తం 8702 మంది ఉన్నారు. ఆయా కార్మికుల కుటుంబ సభ్యులతా కలిసి మొత్తం 34,808 మంది ఇక్కడ వైద్యసేవలు పొందవచ్చని అధికారవర్గాలు వెల్లడించాయి.

సేవలు ఇలా..

ఇది వరకు సీఆర్ఎస్ నాలుగు పడకల ఆసుపత్రిగా ఉండేది. ప్రస్తుతం 50 పడకల స్థాయి అవ్వడంతో రైల్వే కార్మికుల ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉంది. గతంలో ఒక వార్డు అంటూ ఉండేది కాదు. ఇప్పుడు వివిధ వార్డులను ఏర్పాటు చేశారు. గతంలో 300 ఎంఏ ఎక్స్‌రే సదుపాయం, ల్యాబ్, చిన్నపాటి ఆపరేషన్ థియేటర్, అంబులెన్స్ సర్వీసులు ఉన్నాయి. ఈ నూతన ఆసుపత్రిలో 300 ఎంఏతో పాటు 100 ఎంఏ ఎక్స్‌రే పోర్టబుల్ యంత్రాలను ప్రవేశపెట్టారు. ఎక్స్‌రే తీసుకోవాల్సిన రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చేశారు. ల్యాబ్ సదుపాయం గతంలో కంటే బాగా మెరుగుపర్చారు. దీనికితోడు బయట ల్యాబ్‌ల్లోనూ కొన్ని ముఖ్యమైన పరీక్షలు చేయిస్తున్నారు. ఐసీయూని ఏర్పాటు చేయటం విశేషం. పురుషులు, మహిళలు, ప్రత్యేక, ప్రముఖుల వార్డులనూ ఏర్పాటు చేశారు. ప్రధానంగా అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వచ్చింది. మహిళల కోసం గైనిక్ క్లీనిక్‌ను ప్రవేశపెట్టారు. నిత్యం అవసరమయ్యే ఎండోస్కోపిక్ యంత్రాలు, వెంటిలేటర్లు, అల్ట్రాసోనాగ్రాఫిని కార్మికుల కోసం తీసువచ్చారు. ఫిజియోథెరపీ కేంద్రాన్ని ఏర్పాటుచేయడంతో అనేక మంది వయసు పైబడిన వారికి ఉపశమనం నెలకొంది.

రోజుకు 250 మందికి..

రేణిగుంట, సీఆర్ఎస్, తిరుపతి, పాకాల, కోడూరు, రాజంపేట, పుత్తూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తితో పాటు 100 కిలో మీటర్ల దూరంలో ఉన్న అన్ని రైల్వేస్టేషన్ల కార్మికులకు ఇక్కడ వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. గతంలో రోజుకు 120 మంది రోగులు వచ్చేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపు అయింది. వార్డులు ఉండడంతో ఇక్కడే ఉండి వైద్యం పొందేందుకు అనేక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఆసుపత్రిలో ఉండి వైద్యం పొందేవారు రోజుకు 15 నుంచి 20 వరకు వస్తున్నారు.



ఆపరేషన్ యంత్రాలను శుభ్రం చేసే పరికరం



ఐసీయూ కేంద్రం

అందరికీ ఉపయోగం



ఈ ఆసుపత్రి రైల్వేలోని అన్ని శాఖల ఉద్యోగులు, కార్మికులకు కుటుంబాలకు వైద్యసేవలకు ఉపయోగపడుతుంది. గతంలో లేనటువంటి అనేక నూతన పరికరాలు ఉపయోగిస్తున్నాం. అందుకు తగ్గ సిబ్బంది ఉన్నారు. కార్మికులు, ఉద్యోగులపై ఆర్థిక భారం తగ్గింది. అత్యావసరమైన కేసులను తిరుపతి స్విమ్స్‌కు సిఫార్సు చేస్తాం. ఇక్కడ శుభ్రత, భద్రత, గార్డెన్ పర్యవేక్షణకు అదనంగా మరో 20 మంది అవసరమని ఉన్నతాధికారులను కోరాం.

-సురేంద్రనాయక్, ఏసీఎంఎస్, రైల్వే ఆసుపత్రి



విద్యుత్తు ఆదా చేసే వీధి దీపాల ప్రదర్శన



ఫోన్ సాయంతో ఇంటిలోని దీపాలు ఆర్పడం, వెలిగించే విధానం



సులభంగా పంటకు మందు పిచికారి చేసే యంత్రం



ఆటోమెటిక్ రైల్వేగేట్ విధానం

నైపుణ్యాలను వెలికితీసేందుకే పాలిటెక్నిక్ ఫెస్టివల్

ఆర్‌జేడీ సూర్యుడు

తిరుపతి(విద్య), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఫెస్టివల్‌ను జిల్లాలో మొదటిసారిగా నిర్వహిస్తున్నట్లు సాంకేతిక విద్యాశాఖ ఆర్‌జేడీ బి.సూర్యుడు పేర్కొన్నారు. తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జరిగిన పాలిటెక్నిక్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లాలోని 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 21 ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు 140 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మొదటిసారి జిల్లాలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రతిభచూపిన వారిని ఎంపిక చేసి నవంబరు లేక డిసెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. ఇలాంటి ప్రదర్శనలో పాల్గొనడం వలన విద్యార్థుల్లో సృజనాత్మకశక్తి పెంపొందడమే కాదు.. పరిశోధనల వైపు ఆసక్తి చూపుతారని వెల్లడించారు. ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ పాలిటెక్నిక్ చదివే విద్యార్థులే కాదు అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు హాజరై సృజనాత్మకతను మెరుగుపచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపల్, విభాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



తిరుపతి రైల్వేస్టేషన్‌లో రైళ్లకోసం ప్రయాణికుల పడిగాపులు

నిలిచిన ముంబయి రైళ్లు..

శ్రీవారి భక్తుల ఇక్కట్లు భోజన ఏర్పాట్లు చేసిన తితిదే

తిరుపతి(రైల్వే), న్యూస్‌టుడే: ముంబయిలో వరదల కారణంగా తిరుపతి, రేణిగుంటలకు రావాల్సిన పలు రైళ్లు నిలిచిపోయాయి. ముంబయికి వెళ్లు రైళ్లు ఎప్పుడు వస్తాయో తెలియక తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన భక్తులు తమ ప్రాంతాలకు చేరుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ముంబయి నుంచి తిరుపతి మీదుగా కన్యాకుమారి వెళ్లాల్సిన కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ బుధవారం తెల్లవారుజామున 3.15 గంటలకు రావాల్సిఉంది. రాత్రి 10 గంటల వరకు రాలేదు. ముంబయి నుంచి రేణిగుంట మీదుగా చెన్నై వెళ్లాల్సిన దాదర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు రావాలి. రాత్రి 11 గంటల వరకూ రాలేదు. ఇవి ఎప్పుడు వస్తాయో తెలియక బుధవారం ఉదయం నుంచి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు నిరీక్షిస్తున్నారు. రైల్వే లైజన్ అధికారి కుప్పాల సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ సుబోధ్ మిత్రలు తితిదే సహకారంతో పెరుగన్నం, సాంబారు అన్నం, చపాతీ భక్తులకు అందించారు. రైల్వే సీటీఐ టీవీరావు, ఆర్పీఎఫ్ ప్రభాకర్‌రెడ్డి, యూనియన్ నాయకులు సుదర్శన్‌రాజు, సుదర్శనరెడ్డి తదితరులు ప్రయాణికులకు సేవలు అందించారు.

నేడు అన్‌ట్రైన్డ్ టీచర్ల శిక్షణ నమోదుకు గడువు

చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే : జిల్లాలోని అన్‌ట్రైన్డ్ టీచర్లకు జాతీయ మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం వీరందరూ ఆన్‌లైన్‌లో తమ పేరును నమోదు చేసుకోవడానికి గురువారం వరకు గడువు ఉందని డీఈవో శామ్యూల్ తెలిపారు. శిక్షణను ఆన్‌లైన్ డిస్టెన్స్ లర్నింగ్ (ఓడీఎల్) ద్వారా అందజేయనున్నారన్నారు. ఈ ఉపాధ్యాయులు www.-n-ios.a-c.-in- öËº Þ¥E dled.-n-ios.a-c.-in- వెబ్‌సైటులో నేటి సాయంత్రంలోగా నమోదు చేసుకోవాలని ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

'విత్తన సంస్థ'కు మరో ముగ్గురి నామినేషన్లు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఎన్నికలకు సంబంధించి తాజాగా మరో ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరుకు సంబంధించి డైరెక్టర్ ఎన్నికకు వచ్చే నెల 22న ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్లను దాఖలు చేసేందుకు గురువారం ఆఖరు రోజు. ఇప్పటికే మాజీ డైరెక్టర్లు మధుసూదన్‌రావు అలియాస్ చిట్టి, దందోలు భక్తవత్సలరెడ్డి నామినేషన్లు వేసిన విషయం తెలిసిందే. బుధవారం రోజున అమ్మపాళెం గ్రామానికి చెందిన ఈశ్వర్‌రెడ్డి, విష్ణుకుమార్‌రెడ్డి ఇద్దరూ విజయవాడ ప్రధాన కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేశారు. తాజా మాజీ డైరెక్టర్ నీలకంఠారెడ్డి తన నామినేషన్ పత్రాలను పోస్టు ద్వారా కార్యాలయానికి పంపించారు. డైరెక్టర్ ఎన్నికకు సంబంధించి ఇప్పటి వరకు ఐదుగురు అభ్యర్థులు మాత్రం నామినేషన్లను దాఖలు చేశారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించండి

మంత్రి గంటా శ్రీనివాసరావు



వీడియో సమావేశంలో పాల్గొన్న ఎస్ఎస్ఏ పీవో శామ్యూల్, అధికారులు

చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే : అన్ని ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు సర్వశిక్ష అభియాన్ పీవోలను ఆదేశించారు. అమరావతి నుంచి బుధవారం సర్వశిక్ష అభియాన్ అధికారులతో ఆయన వీడియో సమావేశం నిర్వహించారు. కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లోని విద్యార్థినులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించిన వారిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్కరించనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం బాలల దినోత్సవంను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. పాఠశాల విద్య కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, సర్వశిక్ష అభియాన్ రాష్ట్ర పథక సంచాలకులు శ్రీనివాస్ మాట్లాడుతూ సంకల్పం కార్యక్రమం ద్వారా మూడు, ఐదు, ఎనిమిదోతరగతి విద్యార్థులకు చదవడం రాయడం బాగా వచ్చే విధంగా నవంబరులోగా లక్ష్యంను పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈవో, పీవో, ఉప, మండల విద్యాశాఖాధికారులు, సెక్టోరియల్ అధికారులు ప్రతిరోజు పాఠశాలలను తనిఖీచేసి రోజువారి నివేదికను తప్పనిసరిగా అందజేయాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నుంచి ఎస్ఎస్ఏ పీవో శామ్యూల్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

సమయపాలనకు ప్రాధాన్యం

నూతన డీవైఈవో విజయేంద్రరావు

చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే : పాఠశాలలకు ఉపాధ్యాయులు, కార్యాలయాలకు సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించడానికి చర్యలు తీసుకుంటామని చిత్తూరు ఉప విద్యాశాఖాధికారి విజయేంద్రరావు అన్నారు. కృష్ణా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోని ఏడీగా పనిచేస్తున్న విజయేంద్రరావుని ప్రభుత్వం చిత్తూరు డీవైఈవోగా నియమించింది. ఉత్తర్వు అందుకున్న ఆయన బుధవారం ఉదయం ఉప విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పర్యవేక్షకులుగా గతంలో పనిచేశామన్నారు. డివిజన్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల గురించి క్షుణ్ణంగా తెలుసున్నారు. పాఠశాల నిర్దేశించిన సమయాని కల్లా బోధన, బోధనేతర సిబ్బంది విధిగా ఉండాలన్నారు. ఆకస్మిక తనిఖీల్లో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెల్లడైతే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. బాధ్యతలు చేపట్టిన విజయేంద్రరావును పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వపు డీవైఈవో వాసుదేవనాయుడు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఏఎం గిరిప్రసాద్, ప్రధానకార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, నాయకులు లింగయ్య, రవీంద్రరెడ్డి, పలువురు నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజయేంద్రరావుకి శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: **ఆరాధన:** శతక శంఖారావం ముగింపు మహోత్సవం... 06-30: **అన్నదాత,** 07-00: **ఈటీవీ న్యూస్,** 07-30: **శుభమస్తు:** విద్యాగణపతి ప్రత్యేకత ఏమిటి? వ్యాపారం పెరగడానికి గణేశ శ్రీవాస్తురీత్యా ఏం చేయాలి?, 08-30: **టాలీవుడ్ టైమ్,** 09-00: **ఈనాడు సినిమా: పాడుతా తీయగా...** (వినీత్, హీరా).

మధ్యాహ్నం

12-00: **అభి'రుచి':** ఘుమ ఘుమలు **'వంకాయ బజ్జీ కూర',** మీచేతి వంట **'పెసల పులావ్', 'మేథి క్యారెట్ ఫ్రై',** జస్ట్ ఎ మినిట్ **'బేసిన్ బర్ఫీ'** తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: **స్టార్ మహిళ** (మెగా గేమ్ షో), 02-00: **అభిషేకం** (డైలీ సీరియల్), 02-30: **అత్తారింటికి దారేది** (డైలీ సీరియల్), 03-00: **సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2)** (డైలీ సీరియల్), 03-30: **ఆడదే ఆధారం** (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: **వసంతం** (డైలీ సీరియల్), 04-30: **జీన్స్–2** (రిపీట్), 05-30: **ఆడాళ్లా మజాకా:** రావులపాలెం అతివలు ఉత్సాహంగా పాల్గొన్న గేమ్ షో..., 06-00: **శ్రీ భాగవతం** (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: **ఒకరికి ఒకరు** (డైలీ సీరియల్)

రాత్రి

07-00: **సావిత్రి** (డైలీ సీరియల్), 07-30: **మనసు మమత** (డైలీ సీరియల్), 08-00: **స్వాతిచినుకులు** (డైలీ సీరియల్), 08-30: **నా పేరు మీనాక్షి** (డైలీ సీరియల్), 09-00: **ఈటీవీ న్యూస్,** 09-30: **జబర్దస్త్:** మనసారా నవ్వుకోవడానికి మంచి సమయం..., 10-30: **జబర్దస్త్ జల్సాటైం...**

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డిజె రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్

సాయంత్రం
04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డిజె
10:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: మిస్ 420 (అశ్వని నాచప్ప, రాజ్‌కుమార్), 10-00: మార్నింగ్ షో: రాధా కల్యాణం (రాధిక, చంద్రమోహన్), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: పోకిరి రాజా (వెంకటేశ్, రోజా), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఖబడ్దార్ (సాయికుమార్, భావన), రాత్రి: 7-00: ఫస్ట్ షో: బుద్ధిమంతుడు (ఏఎన్నార్), 10-00: యువ దర్శకుడు హను రాఘవపూడితో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఫ్రైడ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ అండ్ మూంగ్ స్ప్రౌట్స్ దోశ, **ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో –** ఎగ్ స్ప్రింగ్ రోల్స్ & కాఫీ బీన్ చికెన్ నగ్గెట్స్, **ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు –** చిట్టి చెగోడీలు & పులిహోర, **ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు –** స్వీట్ పన్నీర్ బుర్జీ, **ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (డయాబెటిక్ రెసిపీ) –** డైజెస్టివ్ డ్రింక్, **ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్"** - గన్ పౌడర్ & ఇడ్లీ, **మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా** (తమిళనాడు క్యూసైన్) - డ్రై ఫ్రూట్స్ సుజీయాం, **మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ –** రామ్ లడ్డూ, **మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్** - బ్రేక్‌ఫాస్ట్ ఉప్మా, **మ.12.45: సూప్స్ & స్టార్టర్స్** - ప్రాన్స్ అండ్ బేబికార్న్ కట్‌లెట్, **మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (మిక్స్‌డ్ క్యూసైన్) –** లాంబ్ స్కీవర్స్ & జింజర్ గార్లిక్ ఆసియన్, **మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్)** - చికెన్ మిర్చి బజ్జీ, **మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ –** పెరటి రుచులు, **మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ –** కోల్హాపూరి పన్నీర్, **మ.2.30: చోటా షెఫ్ –** చికెన్ చీజ్, **మ.5.15: స్నాక్స్** - పన్నీర్ చీజ్ తవ రోటీ.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **లాలిజో పాపాయి, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సిద్ధివినాయక స్వామి మందిరం, ప్రభాదేవి, ముంబయి, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360 ⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360 ⁰, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ **అష్టవినాయక దర్శనం, మహారాష్ట్ర, సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: **లాలిజో పాపాయి,** 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360 ⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 **యువ,** 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 31-08-2017

SVBC – ఉదయం: 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రీపీట్), **సాయంత్రం:** 04-30 క్షేత్రదర్శిని, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాధం + శ్రీనివాస గద్యం + లక్ష్మీనరసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - కర్నాటక, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం అశ్వమేధపర్వం.

భక్తి TV – ఉదయం: 06-00 సాయిహారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 08-00 గణపతి దర్శనం, 08-30 మహాగణపతిం (లైవ్), 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 గణపతి దర్శనం, 05-00 శ్రీగణేశస్తోత్రం, 05-30 సాయి గీతామృతం, 06-00 సద్గురు స్తోత్రం, 07-00 భక్తివిశేషాలు, **రాత్రి:** 07-30 అమృతకలశం, 08-00 మహాగణపతిం(లైవ్), 08-30 రామాయణ తరంగిణి, 09-00 జై..జై..గణేశా:, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

Zee తెలుగు – ఉదయం: 07-30 శుభమస్తు, 08-00 సినిమా: త్రిపుర, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా:పంచాక్షరి.

maa – ఉదయం: 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: రాజా రాణి, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: అందరివాడు, **సాయంత్రం:** 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

GEMINI – ఉదయం: 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ఇంగ్లీష్ పెళ్లాం ఈస్ట్ గోదావరి మొగుడు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: వీడే, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 09-30 సినిమా: జేమ్స్‌బాండ్.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలంటూ శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి శ్రీవిద్యాస్వరూపానంద గిరి అన్నారు. వినాయకచవితి సందర్భంగా నవభారత్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్థానికంగా ఏర్పాటు చేసిన వృద్ధ గణపతిని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి అవసరమైన సందేశాన్ని ఇచ్చే విధంగా వినాయకుని ప్రతిమను ఏర్పాటు చేయడం పట్ల ఆనందం వ్యక్తంచేశారు. తల్లిదండ్రులు భగవత్ స్వరూపాలని అన్నీ పురాణాలు చెప్తున్నాయన్నారు. ప్రత్యక్ష దైవాలను వదలిపెట్టి.. ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా, పుణ్యతీర్థాలు సేవించినా వృథానే అన్నారు. నవమాసాలు భారం అనుకోక ప్రేమతో ఎన్నో కష్టాలను దిగమింగి తల్లి బిడ్డకు జన్మనిస్తుందని, తండ్రి పిల్లల్ని ప్రయోజకులను చేసేందుకు తన జీవితాన్నే అర్పిస్తాడన్నారు. అలాంటి తల్లిదండ్రులకు ఎంత సేవ చేసినా తక్కువేనన్నారు. ఈ తరహా సందేశాన్ని ఇచ్చే విధంగా వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి.. ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసే విధంగా వృద్ధగణపతిని ఏర్పాటు చేయడం పట్ల అభినందనలు తెలిపారు.



వృద్ధ గణపతిని సందర్శించిన శ్రీశుకబ్రహ్మాశ్రమ పీఠాధిపతి శ్రీవిద్యాస్వరూపానందగిరి తదితరులు

ఔత్సాహికులకు ప్రోత్సాహమే లక్ష్యం



మాట్లాడుతున్న రామారావు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు చేసుకునేందుకు ముందుకొచ్చే ఔత్సాహికులకు ప్రభుత్వం విధిగా ప్రోత్సాహం కల్పించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర పరిశ్రమల సమాఖ్య అధ్యక్షుడు రామారావు అన్నారు. పట్టణంలోని త్రినేత్ర అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వాళ్లకు అవగాహన కల్పించేందుకు వీలుగా ఈ నెల 27న తిరుపతిలో పారిశ్రామిక సదస్సును ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, దక్షిణ భారతదేశ సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు సంబంధించి పారిశ్రామిక వేత్తలు ఆహ్వానితులుగా వస్తున్నట్లు వివరించారు. త్వరలో తిరుపతి కేంద్రంగా దక్షిణ భారత స్థాయి సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందు కోసం భవనాలను అన్వేషిస్తున్నట్లు వివరించారు. పరిశ్రమలు ఏర్పాటు చేయదల్చిన వారు.. గురు, శుక్రవారాలు తిరుపతిలోని శ్రీనివాసంలో అందుబాటులో ఉంటానని, వచ్చి కలవవచ్చునని తెలిపారు.

పేగు బంధాన్ని తెంచుకోనివ్వండి..!

☛ కోర్టును ఆశ్రయించిన తల్లిదండ్రులు ☛ అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి

మదనపల్లె (నేరవార్తలు), న్యూస్‌టుడే : 'అనారోగ్యంతో బాధపడుతున్న కుమార్తెకు పలు చోట్ల చికిత్స చేయించాం.. రెండు సార్లు శస్త్ర చికిత్సలు కూడా పూర్తయ్యాయి.. అయినా జబ్బు నయం కాకపోగా.. ఇప్పుడు ఒక కాలు, చేయి పని చేయకుండా పోయాయి.. ఇలాంటి వింత వ్యాధితో బాధపడుతున్న తమ బిడ్డ కారుణ్య మరణానికి అనుమతి ఇవ్వాలి..'..అని కురబలకోట మండలం తెట్టు పంచాయతీ పులగూరవారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెప్ప, అతని భార్య సునీత బుధవారం మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టును ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు.. చిన్నరెడ్డెప్ప, సునీత దంపతులకు ముగ్గురు పిల్లలున్నారు. వీరిలో పెద్ద కుమార్తె శ్రుతిహాసన్ (6)కు మెడ చుట్టూ గడ్డలు వచ్చాయి. కుటుంబ సభ్యులు గత రెండు సంవత్సరాలుగా మదనపల్లె, తిరుపతి, బెంగళూరు, వేలూరులోని పలు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించారు. గత ఏడాది ఒకసారి, ఈ ఏడాది ఒకసారి స్విమ్స్ ఆసుపత్రిలో చికిత్సలు చేయించారు. బాలికకు 'న్యూరోపైబ్రోమా వ్యాధి వచ్చినట్లు గుర్తించిన వైద్యులు రెండు సార్లు చికిత్సలు చేసి మెడ చుట్టు ఉన్న గడ్డలను తొలగించారు. రెండు నెలల క్రితం శస్త్రచికిత్సలు చేయించామని, ఇప్పుడు తమ కుమార్తె ఎడమకాలు, ఎడమచేయి పని చేయడం లేదని,పైగా మెడ చుట్టూ మళ్లీ గడ్డలు వచ్చి ఇబ్బందులు పడుతోందన్నారు. బాలికను పరీక్షించిన ఏ వైద్యుడూ బాగు చేస్తానని చెప్పడం లేదని వారు వాపోయారు. చేనేత కార్మికులుగా పనిచేస్తున్న తాము ఇప్పటికే రూ.3 లక్షల వరకు ఖర్చు చేసి చికిత్సలు చేయించామన్నారు. తమ కుమార్తె అనుభవిస్తున్న నరకయాతనను చూడలేక తాము కారుణ్య మరణానికి కోర్టులో దరఖాస్తు చేసుకునేందుకు వచ్చామని వారు పేర్కొన్నారు. మదనపల్లె రెండో అదనపు జిల్లా జడ్జి కె.వి.మహాలక్ష్మి వారి అభ్యర్థనను పరిశీలించి.. కారుణ్య మరణానికి అనుమతి తమ పరిధిలో లేదని , ఉన్నత న్యాయస్థానానికి వెళ్లాలని సూచించారు. తన బిడ్డకు సాయం చేసి నరకయాతన నుంచి బయటపడేలా దయకలిగిన వారు సాయం అందివ్వాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. మరో వైపు చిన్నారి శ్రుతిహాసన్ నొప్పి భరించలేక కంట తడి పెట్టడం అందరినీ కన్నీటి పర్యంతం చేసింది.



కారుణ్య మరణానికి కోర్టు అనుమతి కోసం కుమార్తె శ్రుతిహాసన్‌తో పాటు వచ్చిన తల్లిదండ్రులు చిన్నరెడ్డెప్ప, సునీత



Sri Venkateswara Institute of Medical S[ciences]
Department of PATHOLOGY
UHID: 20150063430 MRD No871739 Reg Date :
Miss. BOGGALA SRUTHI HASAN , Female, 5 years
Patient Name : | Department : Neurosurgery | Lab Name : PATHOLOGY | Patient Status : IP | Ward Name : Male General Ward
Sample Collection Date: | Lab Sub Centre: | Unit Name (Unit Incharge): | Report Generated Date:
Sample Details : HP-17005676 (Others)
Report For BIOPSY (2 - 5 BLOCK)
HISTO PATHOLOGY
Biopsy Number : B 4734/17
CLINICAL INFORMATION :
CLINICAL DIAGNOSIS :
TYPE OF SPECIMEN : INTRADURAL EXTRA MEDULLARY LESION
GROSS EXAMINATION : Received 2 grey brown to grey white soft tissue bits ... 4x3x2cm. External surface : grey brown, smooth. Cut section : grey white, solid.
MICROSCOPIC EXAMINATION: Multiple sections studied from intradural extramedullar lesion with fibrous capsule comprising spindle cells with elongated wavy nucleus and eosinophilic cytoplasm arranged in fascicles, sheets and whorls with intervening ... areas. Focal area shows increased cellularity with cell showing moderate atypia, ... 7-8/10 hpf and scattered mononuclear giant cells. Adjacent stroma show focal myxoid ... seen lymphocytic collections and nerve bundles.
DIAGNOSIS : NEUTROFIBROMA WITH LOW GRADE MPNST.
NOTE : Its a recurrent neurofibroma with malignant transformation.
NOTE : Advised clinical correlation.
INTRADURAL EXTRA MEDULLARY LESION
Reported By : DR.A.K.CHOWHAN MD 11-7-17.
Verified By (Dr.Amit Kumar Chowhan) Laborator[y]

బాలికకు న్యూరో పైబ్రోమా వ్యాధి ఉన్నట్లు స్విమ్స్ వైద్యులు ఇచ్చిన వైద్య ధ్రువపత్రం

ప్రతిభ

Generally, the aim of a student joined in Intermediate Bi. P. group is to secure a seat in a reputed Medical College to study M.B.,B.S. or other allied Medical Course. To get a seat in M.B.,B.S. one has to face the National Eligibility Entrance Test (NEET) and secure a good rank. Hence, while preparing for Intermediate Public Examination (IPE), critical, analytical and planned study is required.

Tips to tap good score...

Junior Inter STUDY PLAN

Zoology

In IPE, the Zoology Paper is for 60 marks. Out of the 60 marks, 20 marks are allocated for Very Short Answer Questions [VSAQ : 10 questions × 2 marks], 24 marks are allotted for Short Answer Questions [SAQ : 6 questions × 4 marks] and 16 marks for Long Answer Questions [LAQ : 2 questions × 8 marks]. The syllabus of Zoology is divided into 8 Units. Weightage (approximate) of Marks for each unit is given below:

S. No.	Unit	Marks Allocated
I	Diversity of Living World	06
II	Structural Organisation in Animals	10
III	Animal Diversity - I (Nonchordates)	06
IV	Animal Diversity - II (Chordates)	06
V	Locomotion and Reproduction in Protozoans	08
VI	Biology in Human Welfare	14
VII	*Periplaneta americana* (Type Study)	12
VIII	Ecology and Environment	14

- As there is no choice for VSAQ, all questions should be answered. To answer these questions, all topics are to be understood clearly, read thoroughly and remember the subject matter. Answer for these questions must be direct and brief. For example...

  Q. A person is suffering from bowel irregularity and abdominal pain. His stools contains blood and mucus. Based on these symptoms, name the disease and the causative organism.

Ans. a. Disease : Intestinal amoebiasis / Amoebic dysentery.

b. Causative organism: *Entamoeba histolytica*

- Eight SAQ will be given. One has to answer any six in 15-20 lines each. Some questions are related to drawing the diagram and labelling also. Answer for some SAQ may not be in 20 lines and for some, it may be more than 20 lines. Hence, do not count the number of lines. Write the perfect and complete answer. If diagram is asked, draw it with a sharply pointed pencil and label the parts towards right side. If space is not sufficient, write on left side also. Generally diagrams are asked from the units II and VII.
- Regarding LAQ, three questions will be given. You have to answer any two which are familiar to you. Each answer should be in 45-60 lines. Illustrations are also necessary for these questions. This type of questions are selected from the units II, VI, VII and VIII.

Important...

- *Generally for IPE, the questions for public examination are selected from the list of questions given at the end of each unit of BIE / Telugu Akademi Text Book.*
- *While preparing a unit, first read LAQ. They cover some SAQ and VSAQ.*
- *Then read remaining SAQ. They cover some VSAQ. Then read the remaining VSAQ.*



Writer:
K. Sreeramulu
Subject Expert

Syllabus and Questions

I. Zoology - Diversity of Living World

- Generally a two marks question will be given from this unit from branches of Zoology, species, nomenclature etc.
- Four marks question is generally given from basic concepts of classification, species concept and biodiversity.

II. Structural Organisation in animals

- From the topics symmetry-types, body cavity-types two and four marks questions are common. From animal tissues, two and four marks, diagram related questions and sometimes eight marks question may be asked.

III. Animal Diversity - I


- This unit is related to the characters and classification of non-chordates. Two and four marks questions are asked from this unit.
- To study the characters, classification; characters of different classes and examples - one has to prepare tables with the help of your text book. Hence, it becomes easy to remember the features and examples.

IV. Animal Diversity - II


- From this unit two and four marks questions are asked from the characters, classification and examples of chordates.
- As in unit III, prepare tables with the help of your text book. So that it becomes easy to remember the things.

V. Locomotion and reproduction in protozoans

- Generally two and four marks questions will be given from this unit.
- Prepare tables regarding locomotory organelles and examples of protozoans and study them.
- Study the mechanisms of locomotion.
- Practice the diagrams of *Euglena* and *Paramoecium*.
- Read the transverse and longitudinal binary fission and definition of conjugation.



Euglena




Paramoecium

VI. Biology in Human welfare


- As more marks are allocated to this unit, concentrate much on this unit.
- Study the types of parasites, hosts, effects of parasites on their hosts thoroughly.
- Keep special attention on structure, life history and pathogenecity of *Entamoeba histolytica*, *Plasmodium*, *Ascaris* and *Wuchereria*.
- Also study the symptoms, causative organism and control of typhoid, Pneumonia, common cold and ring worm disease besides TDA abuse.
- All the three types of questions will be given in this unit.

VII. *Periplaneta americana* (Cockroach)

- This unit contains structure, locomotion and body systems of cockroach.
- From the body systems eight marks question may be asked.
- Practice all diagrams thoroughly for a four marks question.
- As this unit is also allocated by more marks, much attention is needed.



Salivary glands of Cockroach



Mouth parts of Cockroach

VIII. Ecology and Environment

- Like units VI and VII, for this unit also more marks are allotted. At the same time, quantity of subject matter is also more.
- As all the topics are related the activities going on around us, understanding these topics is very easy and interesting also.
- Different definitions, abiotic factors in ecosystem and their effects on organisms; population interactions, adaptations, food chains, food web, energy flow, nutrient cycles, pollution etc. need special attention.
- All the three types of questions will be given in this unit.
- While reading concentrate your mind on the Lesson. Victory is yours.

Remember...

- ✓ You have to read more and more. To acquire good knowledge on particular topics you have to read more. Make note of points of what you read. Because it's all about Latin and Greek terms and terminologies in Zoology.
- ✓ Get the latest edition of Zoology Text Book Published by the Telugu Akademi / Board of Intermediate Education for reference and thorough study of the topics.
- ✓ You have to practice a much. Write the answers again and again. It seems laborious and old fashioned but one advantage through practice is you can improve your writing skills and your writing speed increases.
- ✓ An important aspect in Zoology is diagrams. Diagrams are the key factors during your exam preparation. If you study a topic straight, you might not understand it, but with diagram, the same concept can understood well. And during exams, one method which would more appropriate is, draw the diagram first, you can explain the concept easily referring to the diagram, chances of missing the points will be less.
- ✓ Develop patience. Every concept cannot be easily understood. If any concept is taking more time, leave it and begin with easy one. It will build your confidence and you can take on the earlier concept with ease.
- ✓ Start preparing as early as possible. Do not wait till the end. Opening the book at the last moment makes you panic and results in great disappointment.

Send your feedback to
pratibhadesk@eenadu.net

For Tenth, Intermediate Study material please visit...
www.eenadupratibha.net

ప్రతిభ

భారతదేశంలోని ఆర్థిక సంస్కరణలను మూడు ప్రతిపాదనలకు సంబంధించిన అంశంగా పరిగణించాలి. అవి: ప్రయివేటీకరణ, సరళీకృత విధానాల అమలు, ప్రపంచీకరణ. ప్రయివేటీకరణ - ప్రభుత్వరంగ సంస్థలు, విధులను ప్రయివేటు రంగపరం చేయడాన్ని తెలుపుతుంది. సరళీకృత విధానాలు - ప్రభుత్వ ఆంక్షలు, నియంత్రణలను సడలించి పారిశ్రామిక, ద్రవ్య, విత్త, విదేశీ విధానం, విదేశీ పెట్టుబడుల్లో ఉదార వైఖరిని పాటించడాన్ని వివరిస్తాయి. ప్రపంచీకరణ - మూలధనం, సాంకేతిక విజ్ఞానం, వస్తుసేవలు, శ్రామిక గమనశీలతపై ఆంక్షలను తొలగించి స్వేచ్ఛా విధానం ద్వారా 'విశ్వ గ్రామానికి' మార్గం సుగమం చేయడాన్ని సూచిస్తుంది.

ప్రపంచీకరణ అంటే ఏమిటి...?

జనరల్ స్టడీస్
ఇండియన్ ఎకానమీ



రచయిత
సీహెచ్. వెంకట్ రెడ్డి
అసిస్టెంట్ ప్రొఫెసర్

భారతదేశంలో ఆర్థిక సంస్కరణలు

సంస్కరణలకు పూర్వం భారతదేశంలో వృద్ధిరేటు అల్పంగా, అసంతృప్తికరంగా ఉండేది. దీనికి కారణం ప్రభుత్వరంగ సంస్థల అసమర్థత, ప్రయివేటు రంగంపై నియంత్రణలు, విదేశీ మూలధనం, విదేశీ పెట్టుబడులపై ఉన్న ఆంక్షలు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో 1991 ప్రారంభంలో భారతదేశం తీవ్రమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంది. 1980 దశకంలో భారత ప్రభుత్వం అమలు చేసిన సురక్షితంకాని స్థూల ఆర్థిక విధానాలే ఆర్థిక అసమతౌల్యానికి దారితీశాయి. 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 5.1 శాతంగా ఉన్న కోశలోటు 1990-91 నాటికి 7.8 శాతానికి చేరుకుంది. ఈ లోటు సర్దుబాటు కోసం ప్రభుత్వం దేశీయ రుణ సమీకరణ చేసింది. 1980-81 లో ఈ రుణం స్థూల దేశీయోత్పత్తిలో 30 శాతం కాగా, 1990-91 నాటికి 50 శాతానికి చేరింది. ఇంతేకాకుండా విదేశీ వ్యాపార చెల్లింపుల శేషపు కరెంట్ ఖాతా లోటు 1980-81 లో స్థూల దేశీయోత్పత్తిలో 1.39 శాతం లేదా 2 బిలియన్ డాలర్లు కాగా, 1990-91 నాటికి 3.9 శాతం లేదా 9.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ విపత్కర పరిణామాల కారణంగా భారత ప్రభుత్వ విదేశీ రుణం 1980-81 లో జీడీపీలో 12 శాతం ఉండగా, 1990-91 నాటికి 23 శాతానికి చేరింది. విదేశీ మారక నిధులు కేవలం ఒక వారానికి సరిపడే దిగుమతుల స్థాయికి పడిపోయాయి. ద్రవ్యోల్బణం 1980-81 లో 6.7 శాతం నమోదు కాగా 1990-91 నాటికి 10 శాతానికి చేరుకుంది. దీనికి తోడు 1990 ఆఖరి దశకంలో ఏర్పడిన గల్ఫ్ సంక్షోభం పెట్రోలు ధరల పెరుగుదలకు కారణమై ఆర్థిక సంక్షోభాన్ని మరింత తీవ్ర స్థాయికి చేర్చింది.

ఆర్థిక సంక్షోభాన్ని నివారించి అంతర్గత, బహిర్గత నమ్మకపు స్థాయిని నిలబెట్టుకోవడానికి అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ చొరవతో 1991 లో ఆర్థిక సంస్కరణలను ప్రవేశపెట్టారు. అందుకే వీటిని 'రావు-మన్మోహన్ నమూనా' అని కూడా పిలుస్తారు. ఈ సంస్కరణల ఫలితంగా భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చెప్పుకోదగ్గ స్థాయిలో విధానపరమైన మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రభుత్వం ప్రపంచస్థాయిలో దేశం శీఘ్రతర ఆర్థికాభివృద్ధి సాధించే దిశగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ (LPG) విధానాన్ని అమలు చేసింది.

ఆర్థిక సంస్కరణల లక్ష్యాలు

ఎ) కోశ లోటును, రెవెన్యూ లోటును తగ్గించడం.
బి) ప్రభుత్వరంగ పరిధిని తగ్గించి, ప్రయివేటు రంగానికి అప్పగించడం.
సి) పారిశ్రామిక లైసెన్సులు ఎత్తివేయడం.
డి) విదేశీ పెట్టుబడులను ప్రోత్సహించడం, విదేశీ వ్యాపారంలో సుంకాలు, కోటాలు ఎత్తివేయడం.
ఇ) ఆర్థిక వృద్ధిరేటును పెంచడం.
ఎఫ్) సంపూర్ణ ఉద్యోగితను సాధించడానికి ఉపాధిని విస్తరించడం.
జి) పేద, ధనిక వర్గాల మధ్య వ్యత్యాసాలు తగ్గించడం.
హెచ్) దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న జనాభాను తగ్గించడం.
ఐ) ప్రాంతీయ అసమానతలు తగ్గించడం.

సంస్కరణల్లోని ముఖ్యాంశాలు

1980 వ దశకం మధ్యలో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం విదేశీ వర్తకం, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ, విదేశీ మూలధనంపై ఆంక్షలను సడలించడానికి ప్రయత్నించినప్పటికీ, పూర్తిస్థాయి సంస్కరణలు మాత్రం 1991 లోనే జరిగాయి. ఈ నూతన ఆర్థిక సంస్కరణలను రెండు విధాలుగా చెప్పవచ్చు. 1) స్వల్పకాలానికి సంబంధించిన స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు, 2) దీర్ఘకాలానికి సంబంధించిన నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు.

స్థూల ఆర్థిక స్థిరీకరణ చర్యలు

ఆర్థిక వ్యవస్థలో వెంటనే సర్దుబాటు చేసేందుకు ఉపయోగించిన ఈ చర్యలనే డిమాండ్ నిర్వహణ చర్యలు అంటారు. దీనిలో భాగంగా ద్రవ్య సప్లయ్‌ని తగ్గించడం ద్వారా ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, కోశ సర్దుబాటు చర్యల్లో భాగంగా రాబడిని పెంచి, వ్యయాలను తగ్గించడం, విదేశీ చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు మూల్యహీనీకరణ లాంటి చర్యలను సూచించారు.

వీటిలో ప్రధానంగా పన్ను రాబడిని పెంచేందుకు 1991, 1998 లలో రాజా చెల్లయ్య కమిటీని, ప్రణాళికేతర వ్యయాన్ని తగ్గించేందుకు 2000 లో గీతాకృష్ణన్ కమిషన్‌ను నియమించారు. ఇవేకాకుండా పన్నేతర రాబడిని పెంచేందుకు నీటిపారుదల, విద్యుత్, రోడ్లు మొదలైన వాటిపై యూజర్ చార్జీలు విధించారు. కోశలోటును తగ్గించేందుకు భారత ప్రభుత్వం 2003 లో 'కోశ సంస్కరణల బడ్జెటరీ నిర్వహణ చట్టాన్ని' (FRBM) ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా అన్ని రాష్ట్రాలు రెవెన్యూ లోటును 2008–09 నాటికి 0 శాతానికి, కోశలోటును 3 శాతానికి తగ్గించగలగాలి. ఈవిధంగా తగ్గించిన రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలను అందిస్తుంది. విదేశీ వ్యాపార చెల్లింపుల్లో లోటును తగ్గించేందుకు 1991 జులై 1, 3 తేదీల్లో రెండుసార్లు మూల్యహీనీకరణ (18% నుంచి 19% మేరకు) చేశారు.

నిర్మాణాత్మక సర్దుబాటు చర్యలు

ఇవి దీర్ఘ కాలానికి చెందినవి. సప్లయ్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించినవి. దీనిలో భాగంగానే భారత ప్రభుత్వం సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ అనే మూడు విధానాలను ప్రవేశ పెట్టడానికి కృషిచేసింది.

సరళీకరణ (Liberalisation)

ప్రభుత్వం నియంత్రిత, కేంద్రీకృత ఆర్థిక వ్యవస్థకు స్వేచ్ఛను కల్పించడాన్ని 'సరళీకరణ' అంటారు. అంటే ప్రభుత్వ జోక్యం తగ్గించి, మార్కెట్ శక్తులకు స్వేచ్ఛను కల్పించడం. లైసెన్సులు, పెట్టుబడి లాంటి విషయాల్లో సరళీకరణ వైపు మొగ్గుచూపారు. సంస్కరణలకు పూర్వం ఏ పరిశ్రమ స్థాపించాలన్నా ప్రభుత్వం నుంచి లైసెన్సులు పొందాల్సి వచ్చేది. కానీ, 1991 ఆర్థిక సంస్కరణల్లో భాగంగా, సరళీకరణ విధానం ద్వారా 18 రకాల పరిశ్రమలు మినహా మిగతా వాటికి లైసెన్సులు ఎత్తివేశారు. ప్రస్తుతం వీటి సంఖ్యను ఆల్కహాలు, సిగరెట్లు, ప్రమాదకర రసాయనాలు, రక్షణ పరికరాలు, పారిశ్రామిక పేలుడు పదార్థాల్లాంటి 5 పరిశ్రమలకు పరిమితం చేశారు.

విదేశీ పెట్టుబడులపై పరిమితిని సవరించారు. 49 శాతం అనే పరిమితిని ఎత్తివేశారు. చాలా పరిశ్రమల్లో 74 శాతం వరకు, కొన్ని గుర్తించిన పరిశ్రమల్లో 100 శాతం విదేశీ పెట్టుబడులను ఆహ్వానించారు. గనులు, పోర్టులు, టూరిజం, తేయాకు, కాఫీ, రబ్బరు లాంటి తోట పంటలు, కొరియర్ సేవలు లాంటి వాటిలో 100 శాతం విదేశీ పెట్టుబడులను అనుమతించారు.

ఏకస్వామ్యాల నియంత్రణ చట్టం (MRTP) పరిశ్రమల స్థాపన, విస్తరణకు అవరోధంగా మారిందని గుర్తించి సరళీకరణలో భాగంగా దీన్ని సవరించారు. మౌలిక రంగాలను ప్రభుత్వ రంగానికి పరిమితం చేసి, ఇతర పరిశ్రమల్లో ప్రయివేటు పెట్టుబడులను ప్రోత్సహించారు. పారిశ్రామిక తీర్మానాల్లో పరిశ్రమలను అత్యంత ప్రభావితం చేసిన వాటిలో 1991, జులై 24 న ప్రవేశపెట్టిన తీర్మానం ప్రధానమైంది. ప్రపంచీకరణ భావాలు దీనిపై ప్రభావం చూపాయి. ఆర్థిక సంస్కరణల్లో భాగంగా విదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని దిగుమతి చేసుకోవడానికి విధానాలను సరళతరం చేశారు. 1991 నుంచి విదేశీ మారక నియంత్రణ చట్టాన్ని (FERA) సడలిస్తూ, విదేశాల్లో భారతీయులు జరిపే లావాదేవీల విషయంలో స్వేచ్ఛను పెంచారు. చివరకు FERA ను 1999 లో విదేశీ మారక నిర్వహణ చట్టం (FEMA) గా మార్చారు. FEMA ను 2000 జూన్ 1 నుంచి అమల్లోకి తెచ్చారు.

ప్రయివేటీకరణ (Privatisation)

గత రెండున్నర దశాబ్దాలుగా ఎంతో ప్రాచుర్యం పొందిన పదం ప్రయివేటీకరణ. దీనికి అర్థం ప్రజల జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే కార్యకలాపాల నుంచి ప్రభుత్వం వైదొలగి, మార్కెట్ వ్యవస్థను పటిష్టం చేయడం. పబ్లిక్ సంస్థల యాజమాన్యం, నిర్వహణ భారాన్ని ప్రయివేటుపరం చేసే ప్రయివేటీకరణ ప్రక్రియను 1969 లో ఆచార్య పీటర్ డ్రకర్ తన 'The Age of Discontinuity' లో ప్రస్తావించారు. 1980 లో మార్గరెట్ థాచర్ ఇంగ్లండ్‌లో పబ్లిక్ రంగ సంస్థలను ప్రయివేటు సంస్థలకు అప్పగించే ప్రక్రియ చేపట్టడంతో ఈ భావన ప్రాచుర్యంలోకి వచ్చింది.

1980 లలో మన దేశంలో కొన్ని రంగాల్లో ప్రయివేటీకరణ ప్రవేశ పెట్టినప్పటికీ ఆశించిన ఫలితాలనివ్వలేదు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ పరిణామాలు, దేశంలో ఏర్పడిన ఆర్థిక సంక్షోభం కారణంగా 1991 లో ప్రవేశపెట్టిన నూతన ఆర్థిక విధానం ప్రయివేటీకరణ ప్రక్రియకు పెద్దపీట వేసింది. పబ్లిక్‌రంగ సంస్థల యాజమాన్యం, ఆస్తులు ప్రయివేటుపరం చేయడం వల్ల సంస్థ యాజమాన్య సామర్థ్యం మెరుగుపడి, ఆర్థిక సమర్థత పెరుగుతుందన్న వాదం బలపడింది.

ప్రయివేటీకరణ ప్రక్రియను మన దేశంలో Disinvestment, ఇంగ్లండ్‌లో Denationalisation, ఆస్ట్రేలియాలో Prioritisations, బొలీవియాలో Industrial transition, బ్రెజిల్‌లో Destatisations, న్యూజిలాండ్‌లో Assets Sales Programme అనే భావనల ద్వారా అమలుచేస్తున్నారు.

1991 లో ప్రయివేటీకరణలో భాగంగా ప్రభుత్వానికి కేటాయించిన పరిశ్రమలను ప్రయివేటు రంగానికి అప్పగించారు. తద్వారా ప్రభుత్వ రంగానికి కేటాయించిన పరిశ్రమలను 8 కి తగ్గించారు. ప్రస్తుతం ఈ పరిశ్రమల సంఖ్యను 2 కి తగ్గించారు. అణుశక్తి, రైల్వే రవాణా మినహా మిగతా అన్ని పరిశ్రమలను ప్రయివేటు రంగంలో స్థాపించుకోవచ్చు.

ప్రయివేటీకరణలో భాగంగానే ప్రభుత్వరంగ సంస్థల్లోని పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని రూపొందించారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ప్రభుత్వానికి ఉన్న వాటాలను ప్రజలకు, సంస్థలకు, మ్యూచువల్ ఫండ్స్‌కు అమ్మివేయడాన్ని 'పెట్టుబడుల ఉపసంహరణ' (Disinvestment) అంటారు. వ్యూహాత్మకంకాని ప్రభుత్వరంగ సంస్థల్లో భారీగా పేరుకుపోయిన ప్రభుత్వ వనరులను సాంఘిక రంగం వైపు మళ్లించడం, మితిమీరుతున్న ప్రభుత్వ రుణ భారాన్ని తగ్గించే లక్ష్యంతో పెట్టుబడుల ఉపసంహరణ విధానాన్ని ప్రవేశపెట్టారు. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా వచ్చిన నిధులను 75 శాతం సాంఘిక సేవలపై, మిగిలిన 25 శాతం లాభాలు వచ్చే ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడులు పెడతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రభుత్వం అనుసరించే సరైన పెట్టుబడుల ఉపసంహరణ వ్యూహాన్ని సూచించమని ప్రొఫెసర్ రంగరాజన్ అధ్యక్షతన 1992 లో కమిటీని నియమించారు. అదేవిధంగా దీర్ఘకాలంలో ఉత్తమమైన పెట్టుబడుల ఉపసంహరణ కార్యక్రమాన్ని సూచించేందుకు జి.వి.రామకృష్ణ అధ్యక్షతన 1996 లో పెట్టుబడుల ఉపసంహరణ కమిషన్‌ను నియమించారు. తర్వాత దీన్ని పునర్ వ్యవస్థీకరించి ఆర్.హెచ్.పాటిల్ అధ్యక్షతన కమిషన్‌ను నియమించారు. పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఎన్డీయే ప్రభుత్వం 2000 లో పెట్టుబడుల ఉపసంహరణ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది.

ప్రపంచీకరణ (Globalisation)

వస్తుసేవలు, మూలధనం, సాంకేతిక విజ్ఞానం, శ్రామికుల ప్రవాహానికి ఎలాంటి అవరోధాలు ఏర్పడకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలను అనుసంధానం చేసే ప్రక్రియను ప్రపంచీకరణగా వ్యవహరిస్తారు. ప్రపంచీకరణ నాలుగు అంశాల పరిధిలో జరుగుతుంది.

ఎ) వాణిజ్య అవరోధాలు తగ్గించి, వివిధ దేశాల మధ్య వస్తుసేవల ప్రవాహానికి ఉన్న ఇబ్బందులను తొలగించడం.
బి) సాంకేతిక విజ్ఞాన ప్రవాహానికి అనుకూల వాతావరణాన్ని కల్పించడం.
సి) మూలధన ప్రవాహానికి అనుకూల వాతావరణం కల్పించడం.
డి) శ్రామిక గమనశీలతను పెంచడానికి అనుకూలంగా ప్రోత్సహించడం.

ఆచార్య జగదీశ్ భగవతి 'దేశ ఆర్థిక వ్యవస్థను అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థతో అనుసంధానం చేసి వ్యాపారం, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్వల్పకాల మూలధనం, మానవ వనరులు, సాంకేతిక విజ్ఞాన ప్రవాహాన్ని కొనసాగించడాన్ని స్వేచ్ఛా ఆర్థిక ప్రపంచీకరణ'గా నిర్వచించారు. 'దేశాల రాజకీయ సరిహద్దులను దాటి ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడమే ప్రపంచీకరణ' అని దీపక్ నాయర్ నిర్వచించారు.

ప్రపంచీకరణ లక్షణాలు

ఎ) అంతర్జాతీయ ద్రవ్య వ్యవహారాల్లో వేగవంతమైన వృద్ధి.
బి) వ్యాపార రంగంలో వృద్ధి వేగం సాధించడం, ప్రత్యేకించి బహుళజాతి సంస్థల వ్యాపార వృద్ధి.
సి) బహుళ జాతి సంస్థల ద్వారా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో పెరుగుదల.
డి) గ్లోబల్ మార్కెట్ల ఆవిర్భావం.
ఇ) రవాణా, కమ్యూనికేషన్ రంగాల శీఘ్రతర వృద్ధి వల్ల సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరించడం.

ప్రపంచీకరణ దిశగా చర్యలు


భారతదేశం ప్రపంచీకరణ దిశగా మూడు ముఖ్యమైన చర్యలను చేపట్టింది. i) రూపాయి బహిర్గత విలువ సవరణ, రూపాయి పరివర్తనం.
ii) దిగుమతుల సరళీకరణ.
iii) వివిధ దేశీయ ఉత్పత్తి రంగాల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం.

విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో ప్రభుత్వ జోక్యం లేకుండా డిమాండ్, సప్లయ్ శక్తుల ద్వారా ద్రవ్యం విలువను నిర్ణయించడాన్ని ప్రపంచీకరణ ప్రక్రియలో అతి ముఖ్యమైన చర్యగా పరిగణిస్తున్నారు. 1991 లో నూతన ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టిన తర్వాత రూపాయిని పరివర్తనం చేసే ప్రయత్నం జరిగింది. ఈ దిశగా భారత ప్రభుత్వం రెండు దశల్లో జులై 1, 3 తేదీల్లో రూపాయి విలువను 18-19 శాతం వరకు తగ్గించి, మూల్యహీనీకరణ చేసింది.

ఆ తర్వాత సంపూర్ణ పరివర్తనం (Full Convertability) లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో పురోగమన చర్యలు చేపట్టింది. 1992-93 బడ్జెట్‌లో పాక్షిక పరివర్తనం ద్వారా ద్వంద్వ మారకరేటు విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ పద్ధతిలో 40 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను అధికార రేటు వద్ద, మిగిలిన 60 శాతం విదేశీ మారక ద్రవ్య సంపాదనలను మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద ఎగుమతిదారులు పరివర్తనం చేసుకున్నారు. 1993-94 బడ్జెట్‌లో వాణిజ్య ఖాతా లావాదేవీల ద్వారా పొందిన మారకపు ద్రవ్యాన్ని సంపూర్ణంగా (మార్కెట్ నిర్ణయించిన రేటు వద్ద) పరివర్తనం చేసుకునే అవకాశం కల్పించింది. 1994 ఆగస్టు 19 న వర్తమాన ఖాతా లావాదేవీలకు సంపూర్ణ పరివర్తనాన్ని ప్రవేశపెట్టింది.

హాయ్! బుజ్జీ!!

> జీవితం అంటేనే పోరాటం, అది ఎప్పుడూ ధర్మం వైపునే ఉండాలి
> – గౌతమ బుద్ధుడు



వడ్రంగి పిట్ట దాని ముక్కుతో చాలా వేగంగా చెట్టుకు రంధ్రం చేసేయగలదు. ఒక్క సెకెనులో అది ఏకంగా 20 సార్లు చెట్టుని పొడిచేయగలదంటే నమ్మగలరా?



పదమూడేళ్ల పిల్లాడు... యోగా గురువయ్యాడు!

■ ఎవరీ పిల్లాడు? మన పేజీలోకి ఎందుకొచ్చాడు?

బోలెడు ఆసనాలు నేర్పించే యోగా గురువు. ఇంత వరకే అయితే చెప్పక్కర్లేదు. మన దగ్గర చిన్నారులు యోగా నేర్చుకోవడం మామూలే కావచ్చు. కానీ ఈ అబ్బాయిది మనదేశమే కాదు. అందుకే మన పేజీలోకి వచ్చాడు మరి.

■ మరి పేరేంటీ? ఊరేంటీ?

ఈ అబ్బాయి పేరు అడమ్ అవిన్. వయసు పదమూడేళ్లు. ఉండేది అమెరికా ఫ్లోరిడాలోని ఫోర్ట్ లాడెర్‌డేల్.

■ అసలీ అబ్బాయి యోగా ఎక్కడ నేర్పిస్తాడు?

పొద్దున్నే టీవీలో యోగా నేర్పించడం చూసే ఉంటారుగా. అలా ఈ పిల్లాడు కూడా ఇక్కడి 'చిల్డ్రన్స్ టెలివిజన్ నెట్‌వర్క్'లో చిన్నారులకు యోగాసనాలు చెబుతుంటాడు. ఈ కార్యక్రమానికి 'వుఫ్ శాంతి' అని పేరు కూడా పెట్టారు. పిల్లలకు బొమ్మలంటే తెగ ఇష్టం కదా... అందుకే అడమ్... పెద్ద కుక్కబొమ్మలాంటి దుస్తులు వేసుకుని టెడ్డీబేర్‌లా వస్తాడు. కెమెరా ముందు అక్కడున్న చిన్నారులకు రకరకాల ఆసనాలు నేర్పిస్తాడు. మంచి మంచి విషయాలు చెబుతుంటాడు.

ప్రస్తుతం అక్కడ ప్రసారమయ్యే ఈ యోగా కార్యక్రమానికి ఆదరణ బాగా పెరిగిపోయిందట. అందుకే త్వరలో అమెరికా మొత్తం ప్రసారాలు చేయనున్నారు. ఫ్లోరిడాలో 'అతి చిన్న యోగా గురువు'గా పేరు తెచ్చేసుకుని ఫేస్‌బుక్‌ల్లాంటి వాటిల్లో వేల మంది అభిమానుల్ని తెచ్చేసుకున్నాడీ బుల్లి గురువు. అంతేకాదూ... చిన్నారుల ఆసుపత్రులకు వెళ్లి వాళ్లు సంతోషంగా ఉండటానికి సరదాగా యోగాసనాలు నేర్పిస్తున్నాడట.

■ ఇంతకీ అడమ్‌కీ యోగాపై ఆసక్తి ఎలా వచ్చింది?

అడమ్ వాళ్ల తాతయ్య 'నువ్వు నవ్వితే ప్రపంచమూ నవ్వుతుంది', 'నవ్వుతూ కృతజ్ఞతలు చెప్పాలి', 'మంచిగా ఆలోచిస్తే మంచే జరుగుతుంది' అనే మూడు మంత్రాలు చెప్పాడట. వాటి ప్రాముఖ్యతను అందరికీ చెప్పడానికి ఈ అబ్బాయి యోగా నేర్చుకుని పిల్లలకు చెప్పడం మొదలుపెట్టాడట. అడమ్ వాళ్ల అమ్మ రాసిన 'మై గ్రాండ్-డాగ్ వజ్ ఎ యోగా ఇన్‌స్ట్రక్టర్' పుస్తకానికి ఈ బుల్లి గురువు బొమ్మ కూడా వేశాడు. అచ్చం ఆ బొమ్మ వేషంలోనే తయారై టీవీలో యోగా చెప్పేస్తున్నాడన్నమాట.

■ మరి మనం చూడలేమా?

చక్కగా చూడొచ్చు. యూట్యూబ్‌లో ఈ కార్యక్రమానికి చెందిన వీడియోలున్నాయి. ఇంకా... త్వరలోనే యాపిల్ టీవీ, అమెజాన్ ఫైర్ టీవీ స్టిక్, సామ్‌సంగ్ స్మార్ట్ టెలివిజన్‌ల్లో ఈ యోగా గురువు కనిపించబోతున్నాడట.

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Quip = ఎగతాళి
- మాతృక = అసలు గ్రంథం

నవ్వుల జల్లులు!



బిట్టు: అక్కా! కంచంలో భోజనంతో పాటు రెండు స్పూన్లు కూడా వేశావెందుకు?

అక్క: నువ్వే కదరా రెండు స్పూన్లు నెయ్యి వెయ్యమన్నావు!

– డి. శ్రీలత, హైదరాబాద్


....

తల్లి: చింటూ! బొంబాయి రవ్వ తీసుకురా ఉప్మా చేసి పెడతా...

చింటు: ఇప్పుడు నేనొక్కడినే బొంబాయి వరకూ ఎలా వెళతానమ్మా!

– మా.శ్రీ. రాజు, పాల్వంచ

చిలిపి ప్రశ్న





తెల్లకోడిపుంజు గుడ్డు ఏ రంగులో


– ఆర్. శ్యామల, హైదరాబాద్

కవలలేరి?










సుడోకు

ఈ సుడోకును 1 నుంచి 9 వరకు అంకెలతో నింపాలి. ప్రతి అడ్డు, నిలువు వరుసల్లోనూ, 3X3 చదరాల్లోనూ అన్ని అంకెలూ ఉండాలి. ఏదీ రెండుసార్లు రాకూడదు.

2			4					
		6			7			3
	7	3	8	6		4		
4	2				1		3	
3				9				7
	6		2				9	8
		4		2	5	3	1	
6			3			5		
					4			2


రాయగలరా?




ఆధారాలతో ఆంగ్ల పదాలు రాసి రంగు గడుల్లోని అక్షరాల్ని వరుసగా చదివితే ఓ పదం వస్తుంది

ఆధారాలు:
1. హంస 2. కోతి
3. ఎలుక 4. పాము
5. గుడ్లగూబ 6. గాడిద

దారేది?





హరికేన్, తుపాన్‌ల మధ్య తేడాలేంటి?

జవాబు: ఇవన్నీ కూడా... మెల్లగా వీచే గాలిలో ఒక్కసారిగా మార్పులు రావడం ద్వారా గాలి వేగం మోతాదు పెరిగిపోవటం వల్ల తలెత్తే భారీ ప్రకృతి వైపరీత్యాలే. ఇవి పరిసరాల్ని నాగరిక జీవనాన్ని అతలాకుతలం చేస్తాయి. అయితే హరికేన్‌లు, టైఫూన్‌ల మధ్య తేడాని సాధారణంగా గాలి వేగాన్ని బట్టి విడమరుస్తారు. గాలివేగం గంటకు వంద కిలోమీటర్లను మించితే అది హరికేన్. గాలివేగం అంతకన్నా తక్కువగా ఉన్నట్లయితే టైఫూన్లు అంటారు. సైక్లోన్లు అంటే సముద్ర ఉపరితలంలో అల్పపీడన ద్రోణులు ఏర్పడ్డప్పుడు.... గాలి భూభాగం నుంచి సముద్రంలోకి వెళ్లి అక్కడ నీటి ఆవిరిని నింపుకుని తిరిగి తీర ప్రాంతాలకు చేరి ఉధృతమైన వర్షపాతానికి దారి తీస్తుంది. బంగాళాఖాతం, హిందూ మహా సముద్రాల్లో ఇలాంటి ద్రోణులు ఎక్కువగా ఏర్పడుతుంటాయి. గాలిలో పీడనాలు మారినా లేదా సైక్లోన్ల ద్వారా పెనుగాలులు వీచినట్లయితే వాటిని తుపాన్లు అంటుంటారు. శాస్త్రీయంగా ఈ నాల్గింటి మధ్య కచ్చితమైన వ్యత్యాసం లేదు. అమెరికా, మధ్య అమెరికా ప్రజలు అన్ని రకాల గాలి దుమారాల్నీ హరికేన్‌లు, టైఫూన్లు అంటుంటారు. ఆసియాలోని మనం వీటిని తుపానులు, సైక్లోన్‌లు అంటాం.

– ప్రొ॥ ఎ. రామచంద్రయ్య, నిట్, వరంగల్; ఎడిటర్, చెకుముకి, జనవిజ్ఞాన వేదిక(తెలంగాణ)

జవాబులు: **రాయగలరా:** 1.Swan 2. Monkey 3. Rat 4. Snake 5. Owl 6. Donkey దాగిన పదం: Season **కవలలేరి:** a, c **చిలిపిప్రశ్న:** అసలు కోడి పుంజు గుడ్డే పెట్టదుగా!

సుడోకు:

2	5	1	4	3	9	7	8	6
8	4	6	1	5	7	9	2	3
9	7	3	8	6	2	4	5	1
4	2	9	7	8	1	6	3	5
3	1	8	5	9	6	2	4	7
5	6	7	2	4	3	1	9	8
7	8	4	6	2	5	3	1	9
6	9	2	3	1	8	5	7	4
1	3	5	9	7	4	8	6	2

మా చిరునామా: హాయ్‌బుజ్జీ విభాగం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, అనాజ్‌పూర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, రంగారెడ్డి జిల్లా 501 512 email : hai@eenadu.net



వెంకటరత్నమ్మకు నగదు అందచేస్తున్న డీఎం జయచంద్ర

కండక్టర్ వెంకటరత్నమ్మకు ఆర్టీసీ ఎండీ అభినందన

పీలేరు ఆర్ఎస్ మెయిన్, న్యూస్‌టుడే: కండక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ సమయస్ఫూర్తిగా వ్యవహరించి బస్సులో ఓ మహిళ ప్రసవం చేయించిన పీలేరు డిపో కండక్టర్ వెంకటరత్నమ్మకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నుంచి అభినంద నలు అందాయి. ఆమె సేవలను ప్రశంసిస్తూ నగదు పురస్కారాన్ని అందిం చారు. దానిని డిపో మేనేజరు జయచంద్ర బుధవారం ఆమెకు అందచేశారు. ఈ సందర్భంగా బుధవారం డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు విధులతో పాటు సామాజికసేవల్లో రాణించాలని అప్పుడే ప్రయాణికులతో సన్నిహిత సంబంధాలు మెరుగుపడతాయని చెప్పారు.

డీఈవో పూల్ ఉపాధ్యాయులకు బదిలీ కౌన్సెలింగ్

చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే : ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీ కౌన్సె లింగ్‌లో ఖాళీ పోస్టులు లేని కారణంగా పలువురిని డీఈవో పూల్‌కి పంపించారు. ఇందులో ఉన్న ఉపాధ్యాయుల జాబితాను పాఠశాల విద్య కమిషనర్ సంధ్యారా ణికి అధికారులు అందజేశారు. వీటిని పరిశీలించిన ఆమె ఉత్తర్వు జారీ చేయ డంతో వీరందరికి బుధవారం సాయంత్రం డీఈవో శామ్యూల్ ఆధ్వర్యంలో బదిలీ కౌన్సెలింగ్‌ను చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. డీఈవో పూల్‌లో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు 25మంది, తెలుగు భాషా పండితులు నలుగురు, ఉర్దు భాషా పండితుల కౌన్సెలింగ్ నిర్వహించారు. కుప్పం, మదనపల్లె, పలమనేరు, తంబళ్లపల్లె నియోజకవర్గం పరిధిలోని ఉన్నత పాఠశాల లకు సర్దుబాటు చేశారు. ఈ ప్రక్రియలో ఉపాధ్యాయులు కోరుకున్న పాఠశాలకే పంపించనున్నారు. నియామక పత్రాలను రెండు రోజుల్లో అందజేయనున్నామని డీఈవో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ పర్యవేక్షకుడు పురుషోత్తం, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లకు..

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లలో ఒకేచోట ఎనిమిదేళ్ల పైబడి పనిచేస్తున్న వారిని డీఈవో శామ్యూల్ బుధవారం స్థానచలనం కల్పించారు. వీరిలో 21మందిని వారు కోరు కున్న పాఠశాలకు బదిలీ చేశారు. అదేవిధంగా అభ్యర్థన బదిలీకి దరఖాస్తు చేసుకున్న వారిని కూడ కౌన్సెలింగ్‌లో స్థానచలనం పొందారు. వీరికి రెండు రోజుల్లో నియామక ఉత్తర్వులను అందజేయనున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యాలయ పర్యవేక్షకుడు పురుషోత్తం, పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

పాముకాటుకు చిన్నారి మృతి



గంగాప్రసాద్ మృతదేహం

జంగాలపల్లి (ఏర్పేడు), న్యూస్‌టుడే: పాముకాటుకు చిన్నారి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని జంగాలపల్లి పంచాయతీ శివగిరి పల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... శివగిరి పల్లికి చెందిన మణి, రాధలకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మణి వ్యవసాయ పనులతో పాటు ఆటో నడుపుకుంటూ కుటుం బాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి కుటుంబసభ్యు లంతా భోజనం చేసి ఇంట్లో నేలపై పడుకున్నారు. చందమామ కథలు చెప్పుకుంటూ తల్లిదండ్రులతో కలసి నిద్రించారు. అర్థ రాత్రి సమయంలో నిద్రలో ఉండగా రెండో కుమారుడు గంగా ప్రసాద్ (4)ను నాగుపాము కాటువేయడంతో తీవ్ర నొప్పితో గట్టిగా కేకలేశాడు. కుటుంబసభ్యులు, చుట్టుపక్కలవారు వచ్చి బాలుడు పక్కనే పడగవిప్పిఉన్న పామును గుర్తించి చంపే శారు. వైద్యం నిమిత్తం చిన్నారిని శ్రీకాళహస్తికి తరలించే లోపే మృతిచెందాడు. బుడిబుడి నడకలు.. ముద్దు ముద్దుగా మాట్లాడే కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదన వర్ణ నాతీతంగా మారింది.

610 పాఠశాలల్లో బాలికలకు కరాటే

ఎస్ఎస్ఏ పీవో శామ్యూల్

చిత్తూరు(విద్య), న్యూస్‌టుడే : జిల్లాలోని 610 ఉన్నత పాఠశాలల్లోని బాలికలకు కరాటే శిక్షణ ఇవ్వడానికి 120మందిని నియమించామని సర్వశిక్ష అభియాన్ పీవో శామ్యూల్ తెలిపారు. వీరు సెప్టెంబరు-1 నుంచి కేటాయించిన మండలాల్లోని పాఠశాలల్లోని బాలికలకు ఆరు నెలలు వరకు శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. బాలికల ఆత్మరక్షణకు సంబంధించినదున శిక్షకులు అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని ఆయన కోరారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. బుధవారం జిల్లా విద్యాశాఖ సమావేశ మందిరంలో ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినులకు కరాటే శిక్షణకు ఇవ్వడానికి ఎంపికైన వారికి నియా మక పత్రాలను అంద జేశారు. ఈ కార్యక్ర మంలో ఏఎంఓ రమేష్, ఏఏఎంవో లోకనాథం, కరాటే శిక్ష కులు పాల్గొన్నారు.




కరాటే శిక్షకులకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎస్ఎస్ఏ పీవో శామ్యూల్

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

పూతలపట్టు, న్యూస్‌టుడే: మండలంలోని బాటగంగమ్మ మిట్టూరు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వ్యక్తి మృత్యువాత పడ్డాడు. ఈ విషయం ఒక్క రోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు మిట్టూరు ఎస్టీవాడకు చెందిన మునిరత్నం(55) మంగళవారం ఉదయం 9గంటల ప్రాంతంలో ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి 10 గంటలు అయినా తిరిగి రాకపోవ డంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించారు. అనంతరం బుధవారం సాయంత్రం గ్రామం పక్కనే ఉన్న నీవానది నీటి కుంటలో శవమై కనిపించాడు. అటువైపుగా వెళ్లిన పశువు కాపరులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం చేరవేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్సై మురళీమోహన్ అక్కడి పరిస్థితిని గమనించి ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతి చెంది ఉంటాడని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

వేరుశనగలో తెగుళ్ల నివారణ



ఆకుపై తుప్పు మచ్చలు

వేరుసెనగ పైరును ఆశించి నష్ట పరుస్తున్న తెగుళ్లు, వాటి నివారణ చర్యలను సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ శివకుమార్ వివరించారు.

శిలీంద్ర తెగుళ్లయిన ఆకుమచ్చ తెగులు, తుప్పు తెగులు గాలి ద్వారా వ్యాపిస్తాయి. వైరస్ వల్ల వచ్చే మొవ్వుకుళ్లు, కాండంకుళ్లు, తెగుళ్లు తామర పురుగుల ద్వారా వ్యాపిస్తాయి.

తిక్కా ఆకుమచ్చ: ఇందులో రెండు రకాల ఆకుమచ్చ తెగుళ్లను గమనించవచ్చు. ఈ తెగులు సెర్కోస్పోరా శిలీంద్రం వల్ల కలుగుతుంది. త్వరగా వచ్చే ఆకుమచ్చ తెగులు మచ్చలు కొంచెం గుండ్రంగా ఉండి ఆకు పైభాగాన ముదురు గోధుమరంగు కలిగి ఉంటాయి. ఆలస్యంగా వచ్చే ఆకుమచ్చ తెగులు మచ్చలు చిన్నగా, గుండ్రంగా ఉండి, ఆకు అడుగు భాగాన నల్లని రంగు కలిగి ఉంటాయి. ఆక మచ్చ తెగులు వల్ల ఆకు రాలిపోయి దిగుబడి బాగా తగ్గిపోతుంది. మచ్చలు, ఆకులు, కాండం, కొమ్మలు, ఊడల మీద కూడా మచ్చలు ఏర్పడతాయి. నివార ణకు మంచి విత్తనాన్ని ఎన్నుకుని విత్తనశుద్ధి చేసుకుని విత్తుకోవాలి. సజ్జ, మొక్కజొన్న, వరిపైర్లతో పంటమార్పిడి చేయాలి. ఆకులపై మచ్చలను గమనిం చిన వెంటనే 400 గ్రాములు క్లోరోథలో నిల్ లేదా 400 మి.లీ. హెక్సాకొన జోల్‌ను 200 లీ. నీటిలో కలిపి ఎకరా పైరుపై పిచికారి చేయాలి. తెగులును తట్టుకునే రకాలైన అభయ, వేమన, జేసీజీ-88 వంటి రకాలను సాగు చేయాలి.

తుప్పు మచ్చలు: దీన్నే కుంకుమ తెగులు అంటారు. ఈ తెగులు రబీలో అధికంగా ఆశిస్తుంది. ఆకుల అడుగు భాగంలో ఇటుకరంగు గల చిన్న పొక్కులు ఏర్పడతాయి. ఇదే ఈ తెగులు ముఖ్య లక్షణం. ఆకు పైభాగంలో పసుపురంగు మచ్చలు కనబడతాయి. తెగులు ఉధృతి అధిక మైనప్పుడు మొక్క అన్ని భాగాలపై పొక్కులు కనబడతాయి. దీని నివార ణకు 400 గ్రాములు క్లోరోథలోనిల్ లేదా 400 గ్రాములు ట్రయిడిమార్ఫ్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరా పైరుపై పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ (చిత్తూరు జిల్లా)

పత్తిలో సస్యరక్షణ చర్యలు

రాష్ట్రంలో పత్తిని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. ఈ పంట దిగు బడులను ప్రభావితం చేసే చీడపీడ లను సకాలంలో గుర్తించి సమగ్ర సస్యరక్షణ చర్యలను పాటిస్తేనే ఆశించిన లాభాలు వస్తాయని వ్యవ సాయ సహాయ సంచాలకుడు తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు.

బ్యాక్టీరియా నల్లమచ్చల తెగు లు: ఈ తెగులు మొక్క వివిధ దశ లలో వివిధ రూపాలలో కన్పిస్తుంది. ముందుగా ఆకులపై కోణాకారంలో నూనె రంగు మచ్చలు ఏర్పడి తర్వాత నల్లగా మారి మూడో దశలో ఆకుల ఈనెల ద్వారా తెగులు వ్యాపించి నల్లగా మారుతుంది. తెగులు ఉధృతి ఎక్కువైతే కొమ్మలకు కూడా వ్యాపించి కొమ్మలు నల్లగా మారి ఎండిపోతాయి. దీన్నే బ్లాక్ ఆర్మ్ అని పిలుస్తారు. ఈ తెగులు పూలకు, కాయలకు సోకినపుడు పరిపక్వం చెందకుండానే పండి రాలిపోతాయి.

నివారణ చర్యలు: తెగులు సోకిన మొక్కల భాగాలను తీసి నాశనం చేయాలి. కిలో విత్తనానికి 10 గ్రా. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్‌తో విత్తన శుద్ధి చేయాలి. ఉధృతిని బట్టి 3, 4 సార్లు 15 రోజుల వ్యవధిలో 10 లీటర్ల నీటికి పోషామైసిన్ లేదా ప్లాంటమైసిన్ 1 గ్రా. కాపరక్సీక్లోరైడ్ 30 గ్రా. కలిపి పిచికారి చేయాలి.

వేరుకుళ్లు తెగులు: భూమిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ తెగులు అన్ని దశల్లో కనపడుతుంది. అర్ధంతరంగా మొక్క ఎండిపోవడం ఈ తెగులు లక్షణం. ఒక్క రోజులోనే మొక్క ఎండిపోతుంది. తెగులు సోకిన మొక్కలు గుంపులు గుంపు లుగా ఎండిపోతాయి. మొక్కలోని అన్ని భాగాలు పైనుంచి కిందకు వాడిపోయి వేలాడుతూ ఉంటాయి. తెగులు సోకిన మొక్కలను తేలికగా పీకేయవచ్చు. ఎదిగిన మొక్కలు వాడి పోయి పసుపుబారి రాలిపోతాయి.

నివారణ చర్యలు: పంటమార్పిడి పాటించాలి. తెగులు సోకిన మొక్క లను పీకి నాశనం చేయాలి. కిలో విత్తనానికి 2 గ్రాములు కార్బండిజమ్ లేదా 10 గ్రా. ట్రైకోడెర్మావిరిడితో విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి. కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సిఫార్సు మేరకు పొటాష్ ఎరువులు వేయాలి.

వడలు తెగులు: ఈ తెగులు పత్తి అన్ని దశల్లో కన్పిస్తుంది. ఎదిగిన మొక్కలలో పుష్పించే దశలో ఈ తెగులు ఎక్కువగా ఉంటుంది. తెగులు సోకిన మొక్కలు ఆకులు వాడిపోయి, ఈనెల మధ్య భాగం పసుపురంగుకు మారుతుంది. ఆ తర్వాత ఎర్రబారు తుంది. కాండాన్ని చీల్చి చూస్తే నల్లని బూజుతో చారలు కన్పిస్తాయి.

నివారణ చర్యలు: పంటమార్పిడి చేయాలి. తెగులు సోకిన మొక్కలను పీకేయాలి. సిఫారసు చేసిన మోతాదులో పొటాష్ ఎరువులను వాడాలి. కాపరాక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి తెగులు సోకిన మొక్కల మొదళ్ల చుట్టూ తడపాలి.

గవర్నరు నరసింహన్‌కు ఘన స్వాగతం

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన గవర్నర్ నరసింహన్ దంపతులకు బుధవారం ఇక్కడ ఘన స్వాగతం లభించింది. పద్మావతి విశ్రాంతి సముదాయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, సీవీఎస్‌వో రవికృష్ణ, తిరుపతి ఎస్పీ అభిషేక్ మహంతి పుష్పగుచ్ఛాలు అందచేసి స్వాగతం పలికారు. అనంతరం వీరంతా కలిసి కొంత సమయం భేటీ అయ్యారు. శ్రీవారి దర్శనానికి తాజాగా తీసుకువచ్చిన మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, శ్రీవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై గవర్నర్‌కు ఈవో, జేఈవోలు వివరించారు. అనంతరం ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. గురువారం ఉదయం శ్రీవారి ఆలయ మర్యాదలతో శ్రీవారిని మరోమారు దర్శించుకోనున్నారు. తిరుమల క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవరాహస్వామివారిని కూడా దర్శించుకుంటారు. ఇస్తికఫాల్ స్వాగతం, శ్రీవారి దర్శనానంతరం శేషవస్త్రం బహూకరణ, వేద ఆశీర్వచనం, శ్రీవారి తీర్థ ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం బహూకరణ లాంటి మర్యాదలు జరగనున్నాయి. మరోమారు రాష్ట్రపతి పర్యటనలో ఈనెల 1న గవర్నర్ పాల్గొంటారు.



తిరుమలలో గవర్నర్ నరసింహన్‌తో భేటీ అయిన తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, జేఈవో శ్రీనివాసరాజు, సీవీఎస్‌వో రవికృష్ణ, ఎస్పీ అభిషేక్ మహంతి



తిరుమలలో గవర్నర్ నరసింహన్‌కు పుష్పగుచ్ఛం అందచేసి స్వాగతం పలుకుతున్న తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు

తిరుమలలో రెండు పాములు పట్టివేత

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో రెండు సర్పాలు భక్తసంచార ప్రాంతంలోకి బుధవారం చొచ్చుకు రావడం కలకలం రేపింది. ఆరు అడుగుల నాగు పాము జేఈవో నివాసానికి సమీపంలోకి రాగా అటవీశాఖ ఉద్యోగి భాస్కరనాయుడు పట్టుకున్నారు. జెర్రిపోతు కల్యాణవేదిక ప్రాంగణంలోకి చేరుకుని భక్తులను భయకంపితులను చేసింది. రెండు పాములను పట్టుకున్న ఉద్యోగి ఓ చోట ఉంచి భక్తులకు చూపించారు. అనంతరం దట్టమైన అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.




రేపు ఎస్వీ వేద విజ్ఞానపీఠం స్నాతకోత్సవం


తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల ధర్మగిరిలోని శ్రీవేంకటేశ్వర వేద విజ్ఞానపీఠం 125వ స్నాతకోత్సవం శుక్రవారం ఘనంగా జరగనుంది. వేదాలు, ఆగమాలు, స్మార్థం, దివ్యప్రబంధ విభాగాలకు చెందిన మొత్తం 76 మంది విద్యార్థులకు తితిదే పట్టాలు ప్రదానం చేయనుంది. ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుంది. స్నాతకోత్సవంలో తిరుమల పెద్దజీయంగార్ పాల్గొననున్నారు. ఎస్వీ వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్.అవధాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.

అచ్చ తెలుగులో అభినందనమాల!

తెలుగులో దస్తూరితో కలెక్టర్ ప్రశంస

పాకాల, న్యూస్‌టుడే: అమ్మ భాషకే తొలి ప్రాధాన్యం.. అన్య భాష అందుకు ప్రత్యామ్నాయమేనంటూ పదే పదే చెప్పుకోవడమే తప్ప చిత్తశుద్ధితో ఆచరించేవారు కొంతమందే. జిల్లా పాలనాధికారి పీఎస్ ప్రద్యుమ్న ఇందుకు భిన్నంగా వ్యవహరించారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకకు చెందిన ప్రద్యుమ్న.. మన జిల్లా కలెక్టర్‌గా తెలుగు భాషకు ప్రాధాన్యతనిచ్చి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. బుధవారం పాకాలలోని 'చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాన్ని(బృందావనాన్ని)' ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సందర్శకుల పుస్తకంలో అచ్చ తెలుగులోనే తన అభిప్రాయాన్ని రాశారు. బృందావనం కార్యక్రమం పాకాల పంచాయతీలో బాగాచేశారంటూ అభినందించారు. తెలుగులోనే అభిప్రాయాన్ని రాసి తెలుగులోనే సంతకం చేయడం చూసి అక్కడున్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఆశ్చర్యపోయారు. తెలుగువారమై ఉండీ.. ఆంగ్లం కోసం వెంపర్లాడుతున్నామనీ, తెలుగు రాష్ట్రంలో తెలుగు బిడ్డలుగా తెలుగుకు తొలి ప్రాధాన్యమివ్వాలనే స్పృహ కొరవడిపోతోందని అభిప్రాయపడ్డారు.





బృందావనం గురించి సిబ్బందితో చర్చిస్తున్న దృశ్యం

రాష్ట్రపతి పర్యటన షెడ్యూల్ వివరాలు...

ఈనాడు-తిరుపతి :

సెప్టెంబరు 1వ తేదీ శుక్రవారం..

- మధ్యాహ్నం 3 గంటలకు ప్రత్యేక విమానం ద్వారా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు.
- 3.05 నుంచి 3.15 : గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, ముఖ్యమంత్రి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఇతర ప్రముఖులు స్వాగతం పలుకుతారు.
- 3.15 : విమానాశ్రయం నుంచి తిరుచానూరు బయల్దేరుతారు.
- 3.35- 4.00: తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు.
- సాయంత్రం 4.20: తిరుచానూరు నుంచి బయల్దేరి స్విమ్స్‌లో నూతనంగా నిర్మించిన శ్రీపద్మావతి మహిళ వైద్య కళాశాల ఆసుపత్రి భవనానికి చేరుకుంటారు.
- 4.22- 4.40: కళాశాల భవనాన్ని ప్రారంభించి, ఆసుపత్రి ఆవరణను పరిశీలిస్తారు.
- 4.50 : ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకోనున్నారు.
- 4.50-6.00: రాష్ట్ర ప్రభుత్వంచే రాష్ట్రపతికి పౌర సన్మాన కార్యక్రమం. ఇక్కడే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ నైపుణ్యాభివృద్ధి అకాడమీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. స్టాండప్ ఇండియా కార్యక్రమంతోపాటు భూ కొనుగోలు పథకం కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందించనున్నారు. 6.00- 6.05 ఎస్వీయూ నుంచి తిరుపతిలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకుంటారు.
- 6.05-7.00 అతిథి గృహంలో విశ్రాంతి
- 7.15-8.15: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామానికి చేరుకుంటారు. అక్కడే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే విందులో పాల్గొంటారు.
- రాత్రి 8.15: తిరుచానూరు నుంచి బయల్దేరి రాత్రి 9 గంటలకు తిరుమలలోని పద్మావతి అతిథి గృహానికి చేరుకొని రాత్రి బస చేయనున్నారు.

సెప్టెంబర్ 2వ తేదీ శనివారం

- ఉదయం 8 గంటలకు పద్మావతి అతిథి గృహం నుంచి బయల్దేరి 8.05కు రాంబగీచా వద్దకు చేరుకుంటారు.
- 8.05-8.20 : వరాహ స్వామిని దర్శించుకొని.. 8.25 గంటలకు శ్రీవారి ఆలయం మహాద్వారం వద్దకు చేరుకుంటారు. రాష్ట్రపతికి తితిదే ఇష్తికాపల్ స్వాగతం పలకనుంది. శ్రీవారి మూలవిరాట్టును దర్శించుకొని హారతి అందుకుంటారు. అనంతరం విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణం చేసి రంగనాయక మండపానికి చేరుకోనున్నారు. అక్కడ రాష్ట్రపతికి వేద ఆశీర్వాదం అనంతరం శ్రీవారి ఫొటో, లడ్డూ, వడ ప్రసాదం బహూకరించనున్నారు.
- 9.10 : శ్రీవారి ఆలయం నుంచి వెలుపలకు వచ్చి, 9.15 గంటలకు రాంబగీచాకు చేరుకుంటారు.
- 9.20: పద్మావతి అతిథి గృహానికి చేరుకొని, 9.50 వరకు విశ్రాంతి.
- 9.50: తిరుమల పద్మావతి అతిథి గృహం నుంచి బయల్దేరి ఉదయం 10.50 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకోనున్నారు.
- 11.00: ఇక్కడి నుంచి బయల్దేరి మధ్యాహ్నం 1.40 గంటలకు దిల్లీ చేరుకోనున్నారు.